RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 179 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి సోమవారం 29-6-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిథి॥ పూర్ణిమ తె॥4.26, మూల తె॥3.54, వర్జ్యం తె॥10.09 - 11.56, దుర్ముహూర్తం మ॥12.23-1.15, శుభ సమయం మ॥ 1.30-3.00, రాహుకాలం ఉ॥7.30-9.00, సూర్యోదయం ఉ॥ 5.31, సూర్యాస్తమయం సా॥ 6.34 గం॥

## రేపు ఎప్‌సెట్ ఫలితాలు విడుదల



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీలో లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఎప్‌సెట్ 2026) ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ ఫలితాలను ఈ నెల 30న (మంగళవారం) ఉదయం విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఈ ఫలితాలు విడుదల చేస్తారని జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్, ఎప్‌సెట్ ఛైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. అయితే, ఎన్ని గంటలకు మిగతా 2లో..

## బంగారం కొనుగోళ్లు తగ్గడం సంతోషకరం

### – మన్‌కీ బాత్ 135వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, జూన్ 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. తాను ఇచ్చిన పిలుపునకు స్పందించి బంగారం కొనుగోళ్లు తగ్గించడంపై ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. మనకీ బాత్ 135వ ఎపిసోడ్‌లో భాగంగా ఆదివారం ప్రధాని పలు అంశాలను ప్రస్తావించారు నాగాలాండ్ విమెన్ ఫుట్‌సల్ లీగ్ గురించి వివరించారు. "పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల దేశ ప్రజలకు కొన్ని విజ్ఞప్తి చేశాను. సాధ్యమైన మేర కొంతకాలం పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని చెప్పాను. నా పిలుపునకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. సందేశాల ద్వారా వారి అనుభవాలను పంచుకున్నారు. ఇంతకాలం సొంతవాహనాల్లో వెళ్లినవారు.. ఇప్పుడు ఇతరులతో కలిసి వెళ్తున్నారు. ఈసారి విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకున్నామని పలువురు సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తున్నారు" అని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. అలాగే యువత క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో నాగాలాండ్ రాష్ట్రం స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. "ఆ రాష్ట్రంలో 'నాగాలాండ్ బేబీ లీగ్' నడుస్తోంది. 5 నుంచి 12 ఏళ్ల మధ్య వయసులో ఉన్న చిన్నారుల్లో స్ఫూర్తి నింపి.. వారు క్రీడలవైపు మొగ్గుచూపేలా చేస్తోన్న అసాధారణ లీగ్ అది. అదే రాష్ట్రంలో నాగాలాండ్ విమెన్ ఫుట్‌సల్ లీగ్‌ను నిర్వహిస్తున్నారు. ఫుట్‌సల్ పదం చాలామందికి కొత్తగా ఉంటుంది. ఇండోర్ ఫుట్‌బాల్‌ను అలా పిలుస్తారు. ప్రతి జట్టులో కేవలం ఐదుగురు ఆటగాళ్లు మాత్రమే ఉంటారు. సాధారణ ఫుట్‌బాల్ మైదానంతో పోలిస్తే.. వారు ఆడే స్థలం చాలా చిన్నగా ఉంటుంది. దీంతో ఆటగాళ్లు చాలావేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆడబిడ్డల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇది అద్భుతమైన వేదికగా నిలుస్తోంది" అని మోదీ కొనియాడారు. అంతరించిపోతున్న హర్గిలా పక్షిని రక్షించడంలో అస్సాం 'హర్గిలా ఆర్మీ' చేస్తోన్న కృషిని ప్రధాని మోదీ కొనియాడారు. ఒకప్పుడు ఈ పక్షిని అశుభంగా భావించేవారు. కానీ, మిగతా 2లో..

## టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలి

### – పల్స్ పోలియో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సీఎం క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సీఎం ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని కాసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలను తెలుసుకున్నారు. ఉద్యోగం, ఉపాధికి వెళుతున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని తల్లిదండ్రులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనా పాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని చెప్పారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదన్నారు. అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలన్నారు. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని చెప్పారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు.

## మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేస్తాం

### – హోంమంత్రి వంగలపూడి అనిత



**నక్కపల్లి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం బోయపాడు, దొండవాక తీరాల్లో రెండు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలకు మరో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి అనిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. రెండేళ్ల కాలంలో సుమారు రూ.600 కోట్లతో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. "నా నియోజకవర్గంలో మత్స్యకార సోదరులతో మంచి అనుబంధముంది. గతంలో మత్స్యకార గ్రామంలోనే టీచర్‌గా పనిచేశాను. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న మూడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో రెండు పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకొచ్చాం. నియోజకవర్గంలో 9వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. మత్స్యకార గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. ఎన్నికల వరకే పార్టీలు.. ఆ తర్వాత అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యం. నియోజకవర్గానికి బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ తీసుకొచ్చాం. మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని కూడా ఏర్పాటు చేస్తాం" అని అనిత హామీ ఇచ్చారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. వైకాపా పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైకాపా నేతలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నారని.. కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మిగతా 2లో..

## పేదలకు ఉపాధి కల్పిస్తే ఓర్వలేరా జగన్?

### – మంత్రి లోకేశ్



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం పెడుతుంటే వైకాపా అధినేత జగన్ ఓర్వలేకపోతున్నారని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా మహిళలు, పేదలకు ఉపాధి కల్పిస్తుంటే జగన్ తట్టుకోలేకపోతున్నారన్నారు. కడప జిల్లాలో 5 స్మార్ట్ కిచెన్లను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని.. హెడ్ కుక్స్, మిగతా 2లో..

## రాజధానిలో అభివృద్ధి చూసి ఓర్వలేకే జగన్ అండ్ కో కుట్రలు

### – మంత్రి డీబీవీ స్వామి



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 3 రాజధానుల పేరుతో అమరావతిపై విషం చిమ్మిన జగన్ అండ్ కో నేడు రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకపోతున్నారని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. అందుకే వైకాపా రౌడీ మూకలు నిన్న రాజధానిలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలు పన్నారన్నారు. ఆ పార్టీ కుట్రల్ని అమరావతి రైతులు తిప్పికొట్టారని తెలిపారు. వైకాపా హయాంలో అమరావతి రైతులపై అక్రమ కేసులు, వేధింపులతో హింసించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు ఏ మొహం పెట్టుకుని వైకాపా మిగతా 2లో..



## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా ?

దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్షణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ధి కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో ధృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కొడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మి ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# సంక్షేమంతో పాటు...అభివృద్ధి కూడా ముఖ్యమే

## – కేవలం సంక్షేమంతో అభివృద్దిని సాధించలేం... కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు...

## – జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్

**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించ నని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని పవన్ సూచించారు. గాదె సాయికృష్ణ వివాదంపై పవన్ కల్యాణ్ స్పందించారు. కృష్ణలంకలో ఒక గొడవ జరిగితే క్రిమినల్‌కు కులాన్ని ఎలా అంటగడుతున్నారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా.. ఏ కులం వారు చేసినా.. తప్పే కదా అని నిలదీశారు. కాపు అయితే ఒప్పు.. ఇంకొకరు అయితే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. తనకు పేపర్లు, ఛానళ్లు లేవని.. జనసైనికులే తన మీడియా అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలను సమానంగా చూడటమే సామాజిక న్యాయమని తెలిపారు. కుల రాజకీయం పొలిటికల్ విక్టరీ అవుతుందేమో గానీ.. సామాజిక విక్టరీ కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడూ జగన్ అండ్ కో చేతిలోనే ఉండాలా అని ప్రశ్నించారు. వైసీపీ వాళ్లను చూడాలి.. ప్రతి అంశంలోనూ కులాన్ని, మతాన్ని కూడా వాడతారని ఎద్దేవా చేశారు. వైసీపీలో పనిచేసిన నాయకులు మన వేదిక మీద ఉన్నారని ప్రస్తావించారు. వీరు దిగజారి మాట్లాడిన దాఖలాలు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. వైసీపీలో ఇతర నేతలు నోరు తెరిస్తే అసభ్య వ్యాఖ్యలే చేస్తారని.. వ్యక్తిత్వ హననాలు చేస్తారని చెప్పుకొచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ మనిషి.. ఆయన విలువలతో మాట్లాడారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 18వేల మంది సాధక్‌లను కలవాలనేది తన భావన అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ప్రతి ఊరిలో బాధ్యతలు అప్పగించిన నాయకుడు.. అక్కడ 2వేల మంది ప్రజలకు తెలిసి ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబును అరకుకు పంపించామని.. ఆయన జనాలతో మాట్లాడతారని.. ప్రకృతిని సంరక్షిస్తారని అన్నారు. పల్నాడుకు బాలినేని శ్రీనివాసరెడ్డి కరెక్టు అని భావించి.. ఆ బాధ్యత అప్పగించామని చెప్పారు. కాకినాడను తట్టుకోవాలంటే.. సామినేని ఉదయభాను కరెక్టు అని భావించామని తెలిపారు. మంత్రి కందుల దుర్గేశ్‌ని అమలాపురం పంపితే బంధువులు ఎక్కువ అని అన్నారని చెప్పారు. మొహమాటానికెళ్లి.. ఎవరినైనా పెట్టాల్సి వస్తుందేమేనని ఆయన అన్నారని చెప్పారు. కానీ ఈ విషయంలో పని చేసే వారికే ప్రాధాన్యం అనేది ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. 'పుష్కర కాలం పాటు మీరంతా నలిగారని.. మీరు ఏపని చేస్తున్నారో కాదు.. దేశానికి సేవ చేసే వారిని ప్రోత్సహిస్తా' అని స్పష్టం చేశారు. తనకు దేశం తర్వాతే ఏదైనా.. కులం అనేది సోషల్ రియాలిటీ అని చెప్పుకొచ్చారు. తాను ఈ విషయాన్ని మార్చాలనో, సరిదిద్దాలనో ప్రయత్నం చేయనని పేర్కొన్నారు. తాను కులాల గురించి మాట్లాడతానని కొంతమంది అంటారని.. తాను కులం కార్డు తీసుకుని ఎప్పుడూ పాలిటిక్స్ చేయనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రం బాగుండాలని, దేశం బాగుండాలని.. మానవత్వం ఉండాలనేదే తన ఆలోచన అని వ్యాఖ్యానించారు. కులం ఎప్పుడూ ఇంటి గడప లోపలే ఆగిపోవాలని.. గడప దాటాకా మన సంస్కృతి, ధర్మాలు ఉండాలని సూచించారు. ఇంకో పది అడుగులు వేస్తే.. దేశం, మానవత్వం గుర్తుకు రావాలని తెలిపారు. స్థాయికి దిగజారి మాట్లాడే వారికి కూడా కౌంటర్‌గా తాను మాట్లాడాల్సి వస్తుందని అన్నారు. క్షేత్రస్థాయిలోకి మీరంతా ఓ మెసేజ్ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ కాకుండా పిల్లలు అందరికీ ఒకే హాస్టల్ ఉండాలనేది తన కోరిక అని ఉద్ఘాటించారు. ఆయా ప్రభుత్వాలే దశాబ్దాలుగా ఈ కులాల పేరుతో పిల్లలను విడదీస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఓట్ల కోసం ప్రజల్లోకి వెళ్తే.. ఇటు దళితులు, అటు కాపులు, ఈ రోడ్డులో బీసీలు అంటూ విడగొట్టి మాట్లాడతారని అన్నారు. రాజకీయం ఇలానే నడుస్తుందనేది తనకు తెలియదని.. తనకు కులాల ఐక్యత ముఖ్యమని స్పష్టం చేశారు.కులం ఐడెంటిటీని తాను మార్చలేనని... లింగమనేని రమేశ్‌కు రాజ్యసభ ఇస్తే.. ఆ కులం మీద కొంతమంది చర్చ, రచ్చ చేశారని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. శివ లాగానే రమేశ్‌ని గుర్తించి.. ఆయన పడిన కష్టానికి తాను బాధ్యతలు అప్పగించానని అన్నారు. కొవైసీపీ పొలిటకల్ గేమ్ కోసం తన మీద విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఇన్ని బలమైన కులాలు ఉండి అధికారంలోకి ఎందుకు రాలేకపోతు న్నాయని ప్రశ్నించారు. బీసీ సామాజిక వర్గాలు 105 కులాలు ఉంటే.. కాపుల్లో బలిజ, ఒంటరి, తెగలు ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకు అధికారం కోసం తాను పని చేయలేదని.. అవకాశాలు అడిగే స్థాయిలోనే ఉన్నానని తెలిపారు. యాభై శాతం బీసీ కులాలు ఉన్నవారంతా కలెక్టివ్‌గా ఉండి అధికారం సాధించుకోవచ్చు కదా అని చెప్పారు. గొడవలు అప్పుడు మాత్రం అందరూ ఏకం అవుతున్నారని అన్నారు. ఓట్ల సమయంలో మాత్రం ముక్కలుగా విడిపోయి వేరే వారికి అవకాశం ఇస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



## తితిదేకు భారీగా విరాళాలు ప్రకటించిన అనంత్ అంబానీ

**తిరుమల, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ తితిదేకి భారీగా విరాళాలు ప్రకటించారు. తితిదేకు 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. 50 మంది బస్సు డ్రైవర్ల జీతభత్యాలు కూడా చెల్లించడంతో పాటు, తిరుమలలో ఛార్జింగ్ స్టేషన్‌ను రిలయన్స్ ఏర్పాటు చేయనుంది. గుజరాత్ వంతారాలో ఉన్నట్టుగా తితిదే గోశాలను ఆధునికీకరణకు అంగీకారం తెలిపారు. ఇవాళ వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో అనంత్ అంబానీ పాల్గొన్నారు. అంతకముందు తితిదే అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో మూలవిరాట్టును దర్శించుకున్న అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.




## అమరావతిని నిర్లక్ష్యం చేసి...ఇప్పుడు డ్రామాలా

### రైతుల పరిరక్షణ పేరుతో వైకాపా దొంగాట

### మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతి రైతుల పేరుతో వైసీపీ మరోసారి రాజకీయ డ్రామాకు తెరలేపిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల మనోభావాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం వైసీపీకి అలవాటేనని ఆరోపించారు. అమరావతిని నిర్వీర్యం చేసిన వారే ఇప్పుడు రైతుల పరిరక్షణ పేరుతో మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. అమరావతి రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధిలేని వైసీపీ నేతలు.. ప్రజలను రెచ్చగొట్టి, ఆ తర్వాత బాధితులమని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడం వైసీపీ రాజకీయ శైలిగా మారిందని ఆయన అన్నారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకున్న పార్టీ ఇప్పుడు అదే ప్రాంతంలో రైతుల పక్షాన నిలుస్తున్నట్లు నటించడం ప్రజలను మోసం చేయడమేనని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిని నిర్వీర్యం చేసిన వారే రైతుల పరిరక్షణ గురించి మాట్లాడటం పూర్తిగా ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఘటనల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు పోలీసులపై దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని అచ్చెన్న ఖండించారు. చట్టాన్ని అమలు చేసే పోలీసులపై దాడులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో హింసాత్మక రాజకీయాలకు చోటు లేదని, అలాంటి రాజకీయాలను ప్రజలు ఇప్పటికే తిరస్కరిస్తున్నారని చెప్పారు.



## రాజమహేంద్రవరంలో భారీ వర్షం.. రోడ్లపైకి చేరిన వరద నీరు

**రాజమహేంద్రవరం, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజమహేంద్రవరంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో కురవడంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండలో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. భారీ వర్షానికి నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, శ్యామల సెంటర్, కోటిపల్లి బస్టాండ్, డీలక్స్ సెంటర్, హైటెక్ బస్టాండ్, ఆదాయ పన్నుశాఖ కార్యాలయం రోడ్డు, కంబాలచెరువు, కోరుకొండ రోడ్డు తదితర ప్రాంతాల్లో వరదనీరు రహదారిపైకి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



## శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



**కవిటి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జమేదారిపుట్టుగ వద్ద జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో బ్రహ్మపుర వెళ్లేందుకు ఆగి ఉంది. ఈ క్రమంలో పలాస వైపు నుంచి వస్తున్న లారీ ఆటోని ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు మురపాల పార్వతి, నర్తు పద్మమ్మ, మండపల్లి తరినమ్మగా గుర్తించారు. ప్రమాదంపై కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మొదటి పేజీ తరువాయి

### రేపు ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

ర్యాంకులను ప్రకటిస్తారనే విషయం మాత్రం ఇంకా తెలియలేదు. మే 12 నుంచి 20 వరకు ఎప్‌సెట్ పరీక్షలు జరగ్గా.. దాదాపు 3.29లక్షల మందికి పైగా విద్యార్థులు రాసిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారమైతే జూన్ 1 నాటికే ఈ ఫలితాలు వెలువడాల్సింది. అయితే, ఇంటర్ మార్కులకు 25% వెయిటేజీ ఉండటంతో.. ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ద్వితీయ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు, సీబీఎస్ఈ రివైజ్డ్ ఫలితాలు పూర్తి స్థాయిలో వచ్చే వరకు అధికారులు ఆగడంతో జాప్యం నెలకొంది. తాజాగా సీబీఎస్ఈ రివైజ్డ్ ఫలితాల ప్రక్రియ తుది దశకు చేరడంతో ఈ నెల 30న ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

### బంగారం కొనుగోళ్లు తగ్గడం సంతోషకరం

ఇప్పుడు అది ఆ రాష్ట్రంలోని గ్రామాలకు ఒక గుర్తింపుగా మారిపోయింది. " ప్రకృతిని శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించిన ఈ పక్షిని ఒకప్పుడు చూడటానికి కూడా ఇష్టపడలేదు. దాని గూడులున్న చెట్లను కూడా కొట్టివేసేవారు" అని ప్రధాని వెల్లడించారు. ఆ మూఢనమ్మకాన్ని జీవశాస్త్రవేత్త పూర్ణిమా దేవి బర్మన్ మార్చివేశారన్నారు. దాంతో ఇప్పుడు ఆ పక్షిని కాపాడేందుకు హర్గిలా ఆర్మీనే సిద్ధమైందని చెప్పారు.

### మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేస్తాం

ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అడ్డుతగులు తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిరంతరం అనిత ఆలోచిస్తారన్నారు. ఆమె ప్రజల మెప్పు పొందారని బీసీ జనార్దన్‌రెడ్డి కొనియాడారు.

### పేదలకు ఉపాధి కల్పిస్తే ఓర్వలేరా జగన్?

అసిస్టెంట్ కుక్స్, హెల్పర్లు, డ్రైవర్లకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వీటితోపాటు జిల్లాలో 33 స్మార్ట్ కిచెన్లు ఏర్పాటుచేసి.. 392 మందికి ఉపాధి కల్పించబోతున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుంటే జగన్‌క్ బాధ ఎందుకని లోకేశ్ ప్రశ్నించారు. పేదలు బాగుపడితే చూడలేకపోతున్నారా? అని నిలదీశారు.

### రాజధానిలో అభివృద్ధి చూసి ఓర్వలేకే జగన్ అండ్ కో కుట్రలు

నేతలు రాజధానికి వెళ్తారని ప్రశ్నించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించామని.. రాజధానిలో పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. జగన్ ఇంకా మావిగన్ అంటూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు.

ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ వైఖరిలో ఏ మాత్రం మార్పు లేదన్నారు. జగన్ అండ్ కో కుట్రలను ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. అమరావతి దేవతల రాజధాని అని.. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా ఏం చేయలేరని స్పష్టం చేశారు.

# నేడు 'డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి'

**తిరుపతి,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 29వ తేదీన ఉదయం 10:00 గం॥ల నుంచి మధ్యాహ్నం 12:30 గం॥ల వరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఏపీఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గం॥ల వరకు 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చు. తిరుపతి: 8712652679, చిత్తూరు:7993147979,నెల్లూరు:08612320427,అన్నమయ్య:9440817449,కడప: 08562242457కర్నూలు: 7382614308 నంద్యాల: 7382618976అనంతపురం: 9154790350 శ్రీసత్యసాయి: 9490615721.

## కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం

**రామచంద్రపురం,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆదివారం,రామచంద్రాపురం మండలం కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జావిద్ నీలకంఠ చౌదరి,మునిరత్నం నాయుడు, పాలడుగు చంద్ర, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్సీపురంలో పల్స్ పోలియో విజయవంతం

**- ఎంఎస్ఎం ఈ డైరెక్టర్ చినబాబు**

**రామచంద్రాపురం,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వాలు చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం ఆర్సీపురంలో విజయవంతంగా జరిగిందని రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ ఎం చిన్నబాబు తెలిపారు. ఆదివారం రావిళ్లవారిపల్లెలో ఎంపీడీవో పులిరాం సింగ్, కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆయన. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5 పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. మండలంలో 42 పల్స్ పోలియో కేంద్రాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా 99% పిల్లలకు పోలియో చుక్కలు వేసామని ఎంపీడీవో పులిరాం సింగ్ తెలిపారు. కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1993 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసి 100 శాతం విజయవంతం చేశామని వైద్యాధికారి డాక్టర్ జావిద్ తెలిపారు. కుప్పం బాదూరు పీహెచ్సీ పరిధిలో 2305 మంది పిల్లలకు గాను 2229 పిల్లలకు పోలియో చుక్కలు వేసి 98 శాతం పూర్తి అయిందని వైద్యాధికారిణి పూర్ణిమ తెలిపారు. పోలియో చుక్కలు వేయించుకోని వారికి రెండవ రోజు ఇంటింటా కార్యక్రమం లో పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి- కమిషనర్



**తిరుపతి టౌన్, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 29వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సింది గా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

## చదువు చెప్పిన గురువుకు సన్మానం ఎమ్మెల్సీ శ్రీకాంత్



**కందుకూరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కందుకూరులో నాకు పాఠాలు బోధించిన గురువు, ప్రధానోపాధ్యాయులు శ్రీ గుట్టపల్లి శేషగిరి రావు పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. నాతో పాటు ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మా గురువుగారు ఈరోజు పదవీ విరమణ చేయడం ఒకవైపు బాధగా ఉన్నప్పటికీ, ఆయన అందించిన సేవలు మరియు మార్గదర్శనం ఎప్పటికీ మాకు స్ఫూర్తిదాయకంగానే నిలుస్తాయి.ఇకపై కూడా తన అనుభవంతో మరెందరో జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ, గురువుగారిని ఘనంగా సన్మానించడం జరిగింది. గురువుగారికి ఆరోగ్యంతో, ఆనందంతో కూడిన పదవీ విరమణ జీవితం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# తిరుపతి ఇఎస్ఐ ఆసుపత్రిని బలోపేతం చేయండి

**-సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు**



**తిరుపతి,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పారిశ్రామికంగా, ఇతర వివిధ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి జిల్లాలో రోజు,రోజుకూ పెరుగుతున్న వలస కార్మికులు, రాయలసీమ జిల్లాల అవసరాలు దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలోని ఈఎస్ఐ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పరచాలని, ప్రస్తుతమున్న నర్సింగ్ సిబ్బంది సంఖ్యను, హౌస్ కీపింగ్ కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగ్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, తిరుపతి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షులు జయచంద్ర, తిరుపతి నగర అధ్యక్షురాలు పి బుజ్జి, కే వేణుగోపాల్, ఎస్ శంకర్ లతో కూడిన సిఐటియు బృందం తిరుపతిలోని ఈఎస్ఐ ఆసుపత్రిని ఆదివారం సందర్శించింది.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, కార్మికులతో నర్సింగరావు, కందారపు మురళి లు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.50 పడకలుగా ఉన్న ఆసుపత్రిని ఇటీవల 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పరిచారని, తగినంత మంది డాక్టర్లు ఉన్నా నర్సుల సంఖ్య పరిమితంగా ఉండటం, హౌస్ కీపింగ్ కార్మికుల సంఖ్య కూడా తక్కువ కావడం వల్ల పని భారం విపరీతంగా పెరిగినట్లు నేతలు గమనించారు.రాష్ట్రంలోని ఇతర ఈఎస్ఐ ఆసుపత్రులతో పోలిస్తే తిరుపతి ఆసుపత్రి లో. సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారని, సూపరింటెండెంట్ శ్యాంబాబు వ్యక్తిగత చొరవ, కృషి కారణంగా కొన్ని అభివృద్ధి పనులు కనపడ్డాయని, రోగులకు ఇస్తున్న భోజన వసతి నాణ్యంగా ఉందని కితాబుని ఇచ్చారు.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేని కారణంగా 50 పడకల ఆసుపత్రి నాటి సిబ్బందే నేటికీ కొనసాగుతున్నారని, సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం.ఆవశ్యకత ఉందని అన్నారు.ఈఎస్ఐ నిర్వహిస్తున్న డిస్పెన్సరీలో రోజుకు 500 మందికి పైగా కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఓపికి వస్తున్నారని తగినన్ని మందులు లేకపోవడం లోపంగా ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు.ఈఎస్ఐ ఆసుపత్రిలోని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.హౌస్ కీపింగ్ కార్మికులకు వేతనం తక్కువగా ఇస్తున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ పథకం ప్రపంచంలోనే ఏ దేశంలో లేని ఓ గొప్ప పథకమని తెలిపారు.ఈ పథకాన్ని కార్మికులకు దగ్గరగా తీసుకువెళ్లి వినియోగింప చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని.లక్షల కోట్ల నిధులు ఉన్న చోట మందులు లేవని,సిబ్బంది లేరని, ఇబ్బందులు ఉన్నాయని చెప్పటం ప్రభుత్వాల చేతగానితనమేనని నర్సింగరావు తీవ్రంగా విమర్శించారు.ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధిలో ప్రారంభం నుంచి కీలకంగా వ్యవహరించిన ఐఎన్టియుసి అధ్యక్షులు లేబూరి రత్న కుమార్ కృషిని నర్సింగరావు ప్రశంసించారు.జూలై నెలలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో కనీస వేతనాల సమస్యపై పెద్ద ఎత్తున క్యాంపెయిన్ ఉన్నదని ఈ క్యాంపెయిన్ లో ఈఎస్ఐ ఆసుపత్రుల పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు తదితర అంశాలపై సిఐటియు కార్యకర్తలు నాయకులు పరిశీలనలు చేపడతారని నర్సింగ్ రావు ప్రకటించారు.

## మహిళల ఆరోగ్యం, భద్రతపై సమగ్ర అవగాహన

**సైబర్ నేరాలు, మహిళా-శిశు రక్షణ, అత్యవసర పోలీస్ సేవలపై అవగాహన**




**తిరుపతి టౌన్, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా శక్తి బృందం వేదాంతపురం సమీపంలోని జే.డి.ఆర్. కన్వెన్షన్ హాల్లో "మహిళా ఆరోగ్య శిబిరం" అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా పోలీస్ స్టేషన్ అదనపు ఎస్పీ శ్రీలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ, క్యాన్సర్ నివారణ, గర్భిణుల సంరక్షణ, బాలల ఆరోగ్యం, మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.మహిళలు, యువత సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు నకిలీ మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ మోసాలు, గుర్తు తెలియని ఫోన్ కాల్స్, డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టం, బాలలపై వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించేందుకు డయల్-112, మహిళల సహాయం కోసం 181, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన ఏ సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని కోరుతున్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

**-అధిక ఫీజులు, పుస్తకాల దోపిడీ చేస్తే కఠిన చర్యలు- విద్యాశాఖ అధికారుల హెచ్చరిక**



**కందుకూరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. కొత్త విద్యా సంవత్సరం నేపథ్యంలో కందుకూరులో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో డిప్యూటీ డీఈవో టి. రవి, ఎంఈఓలు నాగకుమార శర్మ, సుబ్బారెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. డిప్యూటీ డీఈవో రవికుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడం, అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయించడం వంటి చర్యలను సహించబోమన్నారు. ప్రతి పాఠశాల బడి బస్సులు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండాలని, రవాణా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. 60 సంవత్సరాలు దాటిన వారిని బస్సు డ్రైవర్లుగా నియమించరాదని స్పష్టం చేశారు.విద్యార్థుల అపార్ , ఆధార్ వివరాలను వెంటనే సరిచేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నియమాలను పాటించి విద్యాశాఖ అధికారులకు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. కేవలం విద్యలో మాత్రమే పోటీ ఉండాలని యాజమాన్యానికి సూచించారు.ఎంఈఓ శర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పేరు నమోదు చేసి వాస్తవానికి ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విధానాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, అలాంటి అక్రమాలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేరే పాఠశాలలకు వెళ్తామంటే వారిని ఇబ్బందులకు గురి చేయవద్దు అని సూచించారు. కందుకూరు మండల పరిధిలో ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీ తరగతులు నిర్వహించేందుకు ఏ పాఠశాలకు కూడా అధికారిక అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ తరగతులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ కావాలి అనుకునే పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఎంఈఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించరాదని సూచించారు. దసరా, సంక్రాంతి, ఆదివారం, పబ్లిక్ హాలిడేస్ లలో పాఠశాల నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రతి ప్రైవేట్ పాఠశాల తమ ప్రాంగణంలో తరగతుల వారీగా ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించే బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫీజుల విషయంలో పారదర్శకత పాటించాలని, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్యలకు పాల్పడరాదన్నారు.ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భద్రత, తల్లిదండ్రుల ప్రయోజనాల పరిరక్షణలో రాజీ ఉండదని పాఠశాల యాజమాన్యాలకు స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లా

## 5 ఏళ్ళ లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

**కురుగొండ పిఎసిఎస్ చైర్ పర్సన్ డా.దారా అంకయ్య**

**నాయుడుపేట ,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట. ఓజిలి. కురుగొండ ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ప్ర తి తల్లి వారికి పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని కురుగొండ పిఎసిఎస్ చైర్పర్సన్ డాక్టర్ దారా అంకయ్య అన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఓజిలి మండలంలోని కురుగొండ ఆయుర్వేద వైద్యశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ దారా అంకయ్య పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు.పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా వివిధ రకాల వ్యాధులకు దూరంగా ఉండడం తోపాటు ఆరోగ్య భద్రత ఉంటుందని తెలియజేశారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నా ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గండికోటను సత్కరిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

**"గండికోట"కు హానరరీ ఆఫ్ లైబ్రరీస్ పురస్కారం**

**నాయుడుపేట,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట. విజ్ఞానం,వినోదం, వికాసం, వివేకం లక్ష్యంగా పనిచేస్తున్న గ్రంథాలయాలను సమాజానికి చేరువ చేస్తూ, విద్యార్థులకు యువతకు పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుతున్న బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ రామచంద్రాపురం పీఎం శ్రీ పాఠశాల ఉపాధ్యాయులు, సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్ ను సత్కరించారు. ఆదివారం విజయవాడలో జరిగిన గ్రంథాలయాల సందర్శన యాత్రలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గండికోటకు "హానరరీ అఫ్ లైబ్రరీస్" అనే గౌరవంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలలో విద్యార్థులకు అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు అందజేశారన్నారు. వేసవిలో తన సమయాన్ని అంతా గ్రంథాలయాల ఉన్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా గండికోట మాట్లాడుతూ 110 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఐదు గ్రంథాలయాలను సందర్శించడం మురుపురాని అనుభూతి అని తెలిపారు. గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య స్థాపనతో, గాంధీ నడకతో పునీతమైన గ్రంథాలయాలను దర్శించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. హానరరీ ఆఫ్ లైబ్రరీస్ పురస్కారం అందుకున్న గండికోటను ఎంఈఓ దిలీప్ కుమార్, రత్నంతో పాటు పలువురు సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత అభినందించారు.

## బిరదవోలు శ్రీకాంత్ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యే కెలివేటి

**నాయుడుపేట ,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్లూరుపేట. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు పరామర్శించారు.బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి తండ్రి ఆదివారం కన్నుమూసిన సమాచారం తెలుసుకున్న వారు నెల్లూరులోని మాగుంట లేఅవుట్లో ఉన్న వారి నివాసానికి వెళ్లి శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి తండ్రి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని అలాగే ఆయన తండ్రి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఐదేళ్ల లోపు పిల్లలకు రెండు చుక్కలు

**- రెండు చుక్కలు వేయిద్దాం -పోలియోను తరిమికొడదాం**

**-పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే**

**సూళ్లూరుపేట , జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్లూరుపేట. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా, సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధిలోని గణపతి నగర్ స్కూల్ వద్ద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో నెలవల విజయశ్రీ పాల్గొన్నారు.ఎమ్మెల్యే చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశం పోలియో రహితంగా కొనసాగాలంటే తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నెన్నూరులో సర్ సర్వే పరిశీలన

**- నేడు ఆర్ సిపురంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక**

**రామచంద్రపురం,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటర్ల జాబితా సవరణలో భాగంగా( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 ) కార్యక్రమాన్ని బూత్ లెవెల్ ఆఫీసర్లు సమర్థవంతంగా నిర్వహించాలని ఏ ఈ ఆర్ ఓ, తహశీల్దార్ యు మధుసూదన్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని నెన్నూరు, మహంతి వారి పల్లి గ్రామాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఎల్ వో లు సర్ సర్వేపై వేగవంతంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు . ఇంటింటి సర్వే నిర్వహించి మరణించిన, నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ 2026) నిర్వహణలో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఎన్నికల సంఘం ఇచ్చిన నియమ నిబంధనలు పాటిస్తూ తప్పులు తడకలు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. బిఎల్వోలు ప్రతి ఓటరుకు ఎన్యూమినేషన్ ఫారం అందజేయాలన్నారు. ఓటర్లు ఎన్నిమిరేషన్ ఫారంలో సమాచారాన్ని నింపి రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు అతికించి తిరిగి బిఎల్ఓ కి అందజేయాలన్నారు. 18 సంవత్సరాల వయసు నిండిన కొత్తవారికి ఓటు హక్కు కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ పరిశీలన కార్యక్రమంలో బి ఎల్ వో లు ప్రదీప్ నాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులను సన్మార్గంలో నడపడమే లక్ష్యం

**- జిల్లావ్యాప్తంగా చెడు ప్రవర్తన కలిగిన వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు**

**- నేరాలకు దూరంగా ఉండాలని,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**



**తిరుపతి టౌన్,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించి, వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడంతో పాటు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాల్సిన అవసరాన్ని పోలీసులు వివరించారు.కౌన్సిలింగ్ సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ, సమాజంలో శాంతియుతంగా, సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తిని పూర్తిగా విడిచిపెట్టి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడపాలని, ఉపాధి మార్గాలను ఎంచుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. భవిష్యత్తులో ఎవరైనా నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దిగినా, చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిరంతర నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు.జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని పరిరక్షించడం, నేరాలను సమర్థవంతంగా అరికట్టడం, ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతను కాపాడడం తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం ఇటువంటి కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి

## - రాష్ట్ర హైకోర్టు జిల్లా జడ్జి ఎన్. జయ సూర్య



**పలమనేరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చట్టాల ద్వారా ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుతూ న్యాయ వ్యవస్థ పై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలిని రాష్ట్ర హైకోర్టు జిల్లా జడ్జి ఎన్. జయ సూర్య పేర్కొన్నారు. ఆదివారం పలమనేరు పట్టణంలో కోర్టు సముదాయ భవనమునందు వ అదనపు సివిల్ జడ్జి( జూనియర్ డివిజన్) కం- ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ భవన సదుపాయం ప్రారంభించారు.వ అదనపు సివిల్ జడ్జి( జూనియర్ డివిజన్) కం- ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ భవన సదుపాయంపలమనేర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కొన్ని మౌలిక వసతుల పనులను ప్రారంభించారు, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మొక్కను నాటారు. కోర్టులోని ప్రత్యేక సమావేశం మందిరంలో జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు జస్టిస్,డి.రమేష్, జస్టిస్కే .మహేశ్వరరావు, జస్టిస్ టి .సి .డి శేఖర్, జిల్లా జడ్జ్ అరుణ సారిక, పలమనేర్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇషాద్ అలీ ఖాన్ చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు అడ్మినిస్ట్రేషన్ జిల్లా జడ్జి ఎన్. జయసూర్య మాట్లాడుతూ పలమనేరులో మెరుగైన మౌలిక సదుపాయాలతో న్యాయస్థాన భవనం నిర్మించారన్నారు. న్యాయవాదు లలో నూతన ఉత్సాహాన్ని పెంపొందిం చడానికి, ప్రజలకు న్యాయ వ్యవస్థ పై నమ్మకం కలిగించడంలో భాగంగా స్వయంగా కార్యక్రమానికి హాజరు. కావడంజరిగిందన్నారు. పలమనేరు న్యాయస్థాన ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు,రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులను ప్రారంభించిన సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ... పలమనేరు బార్ అసోసియేషన్కు అభి నందనలు తెలిపారు.పలమనేరు కోర్టులో సుమారు 6,వేలు కేసులు పెండింగ్లో ఉన్న నేపథ్యంలో, కేసుల త్వరితగతిన పరిష్కారం కోసం, న్యాయాధికారులపై ఉన్న పనిభారాన్ని తగ్గించేందుకు హైకోర్టు పరిపాలనా పరంగా పలమనేరు నందు రెండు అదనపు కోర్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో కేసుల పెండింగ్ తగ్గి, ప్రజలకు త్వరిత న్యాయం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పలమనేరు కోర్టు భవనం రాష్ట్రంలోని అత్యుత్తమ న్యాయస్థాన భవనాలలో ఒకటిగా ఉందని పేర్కొంటూ, బార్లోని యువ న్యాయవాదులు అందు బాటులో ఉన్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పలమనేరు చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని, ఇక్కడి బార్ అసోసియేషన్ రాష్ట్రంలోని పురాతన బార్ అసోసియేషన్ లో ఇది ఒకటని పేర్కొన్నారు. ఈ గొప్ప సంప్రదాయాన్ని యువ న్యాయవాదులు కొనసాగించాలని పిలుపునిచ్చారు. పలమనేరు ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవేత్తలు, మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదుల సేవలను స్మరించుకుంటూ, వారిని ఆదర్శంగా తీసుకుని యువ న్యాయవా దులు న్యాయ వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డిఓ భవాని ,చిత్తూరు, తిరుపతి, జిల్లాలకు సంబంధించిన జడ్జిలు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓ -2 సి. బాలసుందరంకు పదవీ విరమణ శుభాకాంక్షలు



**పలమనేరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు మండల విద్యాశాఖ అధికారి ( ఎంఈఓ )గా విశిష్ట సేవలు అందించిన సి. బాలసుందరం పదవీ విరమణ పొందిన సందర్భంగా వారికి ఘనంగా పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించబడింది. పలమనేరు మండల విద్యాశాఖాధికారి పి. లీలారాణి గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో భాస్కర్,చిత్తూరు జిల్లా మాజీ డి వై ఈ ఓ వాసుదేవా నాయుడు,విరమణ పొందిన ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖాధికారి (ఆర్జెడి ) రెడ్డి ప్రకాశ్, విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాని, వి. కోట మండలాల మండల విద్యాశాఖ అధికారులు, పలమనేరు మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర మండలాల ప్రధానోపాధ్యాయులు, పలమనేరు మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యాశాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొని సి. బాలసుందరం గారిని ఘనంగా సన్మానించి, శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేసి తమ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాలసుందరం విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, నాణ్యమైన విద్య అందించడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ మార్గదర్శకుడిగా నిలిచి, పరిపాలనలో సమర్థత, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేసి అందరి అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు.విద్యార్థుల శ్రేయస్సు, ప్రభుత్వ విద్యాభివృద్ధి కోసం ఆయన అందించిన సేవలు పలమనేరు మండల విద్యా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా సి. బాలసుందరం తన సేవా కాలంలో సహకరించిన విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది, శ్రేయోభిలాషులం దరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పల్స్ పోలియో విజయవంతం

**చౌడేపల్లి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పల్స్ పోలియో విజయవంతంగా ముగిసిందని మండల వైద్యాధికారిని మోనా తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారు లకు పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు ఐదు మార్గాల గుండా 50 కేంద్రాలను ఏర్పాటు చేసి 4859 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని చేపట్టామని దాదాపు 90 శాతం పూర్తయింది అన్నారు తక్కిన వారికి ఆరోగ్య సిబ్బంది వారి ఇళ్ల వద్దకు వెళ్లి చుక్కలు వేస్తున్నట్లు వివరించారు ప్రధాన కూడళ్ళ బోయకొండ పరిసర ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాట్లు చెసినట్లు వివరించారు. ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో మరో ముందడుగు ఎస్ఐఆర్



**రామకుప్పం,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎస్ఐఆర్ కార్యక్రమం మరో ముందడుగు అని రామకుప్పం మాజీ ఎంపీటీసీలు అల్లి శ్రీను టీవీ రవి కుప్పం నియోజకవర్గం తెలుగు మహిళ తెలుగు యువత ప్రధాన కార్యదర్శులు అలివేలు శ్రీనివాసులు,అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారు రామకుప్పం మండల కేంద్రంలోని 71వ బూతులో అధికారులు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమలో పాల్గొని ప్రజలకు కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు మరియు ఓటర్లకు సవివరంగా వివరించారు. అధికారులు పార్టీ నేతలు బిఎల్ఎ లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలన,18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్ల నమోదు,పేరు, అడ్రస్, ఫోటో తప్పుల సవరణ,మరణించిన/వలస వెళ్లిన ఓటర్ల పేర్ల తొలగింప,ఓటరు కార్డు ఆధార్ అనుసంధానంపై అవగాహన, వంటి కార్యక్రమాన్ని పరిశీలించారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు అంకితభావంతో పనిచేశారు. మహిళలు, వృద్ధులు సైతం ఎండను లెక్కచేయకుండా వచ్చి తమ వివరాలు నమోదు చేయించుకున్నారు.ఎవరి పేరైనా ఓటర్ లిస్ట్లో ఉందో లేదో ఒకసారి చెక్ చేసుకోవాలని లేకపోతే వెంటనే బి ఎల్ ఓ ను సంప్రదించాలని వారు కోరారు, ప్రతి ఓటూ విలువైనదీ వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ వినోద్ కుమార్, టిడిపి 71 వ బూత్ కోఆర్డినేటర్ చాంద్ బాషా ,బిఎల్ఎ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరానికి స్పందన



**పలమనేరు ,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని గంటవూరు బీసీ కాలనీలో ఉన్న శ్రీ శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్. మురుగన్, పలమనేరు తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్, వీరి సంయుక్తంలో పలమనేరు శాసనసభ సభ్యులు అమర్నాథరెడ్డి సహకారంతో డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన రావడం జరిగింది. పలమనేరు మదనపల్లి రోడ్ లో ఉన్న డాక్టర్ ఐ అగర్వాల్ హాస్పిటల్ వారి వైద్య బృందం ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఇందులో దాదాపు 250 మంది వివిధ కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు కంటి అద్దాలు రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్లు మాట్లాడుతూ... శ్రీ తిరుపతి గంగమ్మ గుడి ఆవరణంలోఈ కంటి వైద్య శిబిరానికి వచ్చిన పురుషులకు మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతానని తెలిపారు. కంటి ఆపరేషన్కు తన సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని డాక్టర్ మురుగన్ తెలిపారు.

# నాణ్యమైన పరిశోధనలే సమాజాభివృద్ధికి పునాది

## - అంతర్జాతీయ ప్రచురణలపై అపోలో వర్క్‌షాప్‌లో డాక్టర్ హెచ్. వినోద్ భట్



**చిత్తూరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పరిశోధనలు నిర్వహించి, వాటిని అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రచురించడం ద్వారా పరిశోధకులు విద్యా రంగంలో విశిష్ట గుర్తింపు పొందగలరని ది అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ అన్నారు.ది అపోలో యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ రీసర్చ్ ఆధ్వర్యంలో "ది డాక్టరల్ జర్నీ: ఎసెన్షియల్ స్కిల్స్ ఫ్రమ్ రీసెర్చ్ టు పబ్లికేషన్" అంశంపై నిర్వహించిన నాణ్యమైన పరిశోధన, అంతర్జాతీయ ప్రచురణల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు.ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ భట్ మాట్లాడుతూ, పీహెచ్‌డీ పరిశోధన అనేది కేవలం డిగ్రీ సాధించే ప్రక్రియ మాత్రమే కాదని, సమాజానికి ఉపయోగపడే కొత్త విజ్ఞానాన్ని సృష్టించే బాధ్యత అని అన్నారు. పరిశోధకులు శాస్త్రీయ దృక్పథంతో, నైతిక విలువలను పాటిస్తూ పరిశోధనలు నిర్వహించాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాల జర్నల్స్‌లో పరిశోధనా వ్యాసాలను ప్రచురించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.ప్రధాన స్పీకర్‌గా పాల్గొన్న శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఆర్. నాగరాజు మాట్లాడుతూ, నాణ్యమైన పరిశోధనలు సమాజ హితానికి ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. పరిశోధన అంశం ఎంపిక, పరిశోధన రూపకల్పన, శాస్త్రీయ వ్యాసాల రచన, అంతర్జాతీయ జర్నల్స్ ఎంపిక, ప్రచురణ ప్రక్రియలపై సమగ్రంగా వివరించారు. మరో స్పీకర్, ది అపోలో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ రామయ్య ఇటుమల్ల పరిశోధనలో నైతిక విలువలు, ప్లేజరిజం నివారణ, కృత్రిమ మేధస్సు వినియోగం, సమర్థవంతమైన పరిశోధనా ప్రచురణకు అవసరమైన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డిజిగ్నేట్ వైస్ చాన్సలర్ డా. నితిన్ ఎం. నాగర్‌కర్, రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్., స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డా. జగదీశన్, వర్క్‌షాప్ కన్వీనర్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్ రెడ్డి, పరిశోధన విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.బి. హిమాబిందు, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, పీహెచ్‌డీ గైడ్‌లు, పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరిశోధన నుంచి అంతర్జాతీయ స్థాయి ప్రచురణ వరకు అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై ఈ వర్క్‌షాప్‌లో పరిశోధకులకు ఆచరణాత్మక మార్గదర్శనం అందించారు.



# చిత్తూరు జిల్లా

## పోలియో చుక్కలు వేసిన చైర్మన్



**పలమనేరు ,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంటవూరు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి నందు ఐదవ వార్డ్ ఇంచార్జ్,తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు పోలియో చుక్కలను వేయడం జరిగింది. పిల్లల నుండి 18 సంవత్సరాలు వరకు పోలియో చుక్కలు తీసుకొని వారు తప్పకుండా వేసుకోవాలన్నారు. పోలియో అహిత సమాజాన్ని నిర్మిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు సెక్రటరీ మేదర సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, 5వ వార్డు అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీలు చేసిన అడిషనల్ ఎస్పీ



**పుంగనూరు,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్నంలోనిపోలీస్ స్టేషన్లో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని వివిధ రికార్డులు, కేసుల నిర్వహణ, స్టేషన్ విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.తనిఖీల అనంతరం స్టేషన్ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్బరాయుడు, ఎస్ఐ ఆన్సర్ భాష , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పూర్తి చేయకపోతే దీక్ష



**పుంగనూరు ,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితిపై ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర మైనారిటీ నాయకుడు అయూబ్ ఖాన్, ఎస్సీ మోర్చా నాయకుడు నరసింహులు ఆదివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు సమీపంలోని 50 రాళ్ల మరవలో ఉన్న శనేశ్వరస్వామి, శ్రీ బోయకొండ ఆలయానికి ప్రతిరోజూ వందలాది మంది భక్తులు వస్తుంటారని, రహదారిపై ఎగిసిపడుతున్న దుమ్ము ఆలయ ప్రాంగణంలోకి చేరి భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు తెలిపారు.బోయకొండకు వెళ్లే కర్ణాటక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని,గత నెల రోజులుగా రహదారి మరమ్మతుల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు నామమాత్రపు పనులతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పుంగమ్మ చెరువు కట్ట వద్ద రహదారి పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ తారు కొరత పరిస్థితులు వంటి కారణాలు చూపుతూ పనులు చేపట్టకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ఈ రహదారి దుస్థితి కారణంగా గతంలో ఓ ఇంటర్మీడియట్ విద్యార్థి ఈ రోడ్డులో ద్విచక్రవాహనం నడుపుతూ అదుపు తప్పి మృతి చెందిన ఘటనను గుర్తు చేస్తూ, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిని బుధవారం లోగా పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్అండ్‌బీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని బీజేపీ రాష్ట్ర మైనారిటీ నాయకుడు అయూబ్ ఖాన్ హెచ్చరించారు.

## శ్మశాన వాటికకు ఫ్రీజర్ బాక్స్ వితరణ

### - దాతలను సన్మానించిన గాండ్ల సంఘం



**పలమనేరు,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ మందలి పాతపేట అగర బత్తి కాలనీ హిందూ స్మసాన వాటికకు రూ. 50వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్స్ ను హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆదివారం పలమనేరు పట్టణ గాండ్ల సంక్షేమ సంఘం ప్రతినిధులకు స్మశాన వాటిక వద్ద ఉచితంగా అందించారు.ఈ సందర్భంగా పట్టణ గాండ్ల సంఘం ప్రతినిధులు చంద్రఅనే బాలకృష్ణ,అమరేంద్ర బాబులు మాట్లాడుతూ....ఈ పాటికే తమ సంఘం తరపున ఈ స్మశాన వాటిక పునరుద్ధరణ పనులను దాతలు సహకారంతో సుమారు రూ. 14 లక్షల వ్యయంతో ఆధునిక పద్ధతిలో మృతదేహాలను ఖననం చేయడం,నూతన ధర్మ రాజులు గుడి,నూతన గదులు నిర్మాణం పనులు,షెడ్డు వంటి అభివృద్ధి పనులు గత ఆరు నెలలుగా జరిగిందన్నారు.ఈ నేపథ్యంలో హెల్పింగ్ హాండ్స్ సంస్థ శివ వారి బృందం ఇక్కడి స్మశాన వాటికకు ఫ్రీజర్ బాక్స్ అందించడం చాలా సంతోష కరమన్నారు.ఎవరికైనా ఫ్రీజర్ బాక్స్ అవసరమైతే హెల్పింగ్ హాండ్స్ శివకు లేదా తమ సంఘం సభ్యులకు తెలియజేస్తే అవసరానికి సహకరిస్తామన్నారు.చివరి అంతిమ యాత్రలో భాగంగా మృత దేహాలకోసం సేవా దృక్పథంతో ఫ్రీజర్ బాక్స్ అందించిన శివ సేవా బృందాన్ని గాండ్ల సంఘం తరపున ప్రత్యేకంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంకనూ సంఘం ప్రతినిధులు సుబ్రహ్మణ్యం శెట్టి,కృష్ణమూర్తి,టి.కె.షణ్ముగం ,సుబ్రహ్మణ్యం, ఎ.ఆర్.కుమార్, శ్రీధర్ బాబు,కోదండరామయ్య,హైకోర్టు న్యాయవాది శ్రీనివాసులు, జగదీశ్ ,శరవణన్,యువత ప్రతినిధులు శ్రీనాద్, మూర్తి,రాజేష్,బాలు,కేశవులు, ఉదయ్, పళని,పట్టణ సేవారత్న శ్రీపురం సీతారామయ్యలు పాల్గొన్నారు.

## 'ఛలో కడప' విజయవంతం చేయండి

**రామకుప్పం,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాదిగ యువకుల హత్యలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని బ్రహ్మంగారిమఠం మండలం లో జరిగిన ఇద్దరు మాదిగ యువకుల దారుణ హత్య కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కడపలో నిర్వహించనున్న ఛలో కడప ఎస్పీ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గ ప్రజలు, ఉద్యమకారులు భారీ సంఖ్యలో తరలిరావాలని కుప్పం నియోజకవర్గ కో-ఇంచార్జ్ వెంకటేష్ మాదిగ పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి మాదిగ యువకుడు, ప్రతి కార్యకర్త తన బాధ్యతగా పాల్గొనాలని కోరారు. నేరస్థులను వెంటనే అరెస్ట్ చేయాలి. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలంటూ దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలనీ,సోమవారం ఉదయం 9 గంటలకు గంటలకు కడపకు చేరుకుని మన ఐక్యత, మన ఆత్మగౌరవాన్ని చాటుదామని ఆయన పిలుపునిచ్చారు.

## భారత చైతన్య యువజన పార్టీ కమిటీల నియామకం

**పుంగనూరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజాసేవను మరింత సమర్థవంతంగా నిర్వహించే లక్ష్యంతో వివిధ మండలాలు, అనుబంధ విభాగాలు, యూత్ విభాగాలకు కమిటీలను అధికారికంగా నియమించడం జరిగింది.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులందరూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేయాలని పార్టీ నాయకత్వం ఆకాంక్షించింది.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులందరికీ భారత చైతన్య యువజన పార్టీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

## ఘనంగా ఉబ్బ దేవర మహోత్సవం



**పీలేరు ,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరులోని శ్రీ సాయిబాబా రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 11 గంటలకు తిరుపతి మార్గంలోని నూతన దోభీ ఘాటు వద్ద ఉబ్బ దేవర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, వాగు వంకల్లో నీళ్లు అందుబాటులోకి వచ్చి, తమ కులవృత్తికి ఆటంకం లేకుండా చూడాలని రజకులు భగవంతుని ప్రార్థిస్తూ ఉబ్బ దేవర మహోత్సవం చేయడం ఆనవాయితీ.ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నందున ఈరోజు రజక సేవా సంఘం సభ్యులు సమిష్టిగా ఉబ్బదేవర మహోత్సవాన్ని నిర్వహించారు.ఉబ్బ దేవర కారణంగా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా రజక సేవా సంఘం గౌరవ సలహాదా రులు అనిల్, అధ్యక్షులు పి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కిరణ్, ఉపాధ్యక్షులు నాగార్జున, కోశాధికారి సిద్దయ్య, కార్యదర్శి కే.వెంకట రమణ, సభ్యులు రమణ, మల్లికార్జున, లతా, ఉషారాణి, ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌పై చర్యలు శూన్యం



**మదనపల్లె, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ చిత్రంలోని గుట్ట మదనపల్లె మండలం వేంపల్లి గ్రామ పంచాయితీ లోనిది. బెంగళూరు రోడ్డు వేంపల్లి క్రాస్ నుంచి వేంపల్లి కు వెళ్లే దారి మధ్యలో ఓ చర్చి సమీపంలో ఈ గుట్ట ఉంది. గత కొన్ని రోజులుగా కొందరు మట్టి మాఫియా వ్యక్తులు రాత్రింబవళ్లు ఎస్కలేటర్లు పెట్టి, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు.మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రావెల్ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ విషయమై స్థానిక ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం తమ పల్లె పై టిప్పర్లు, ట్రాక్టర్లు మట్టితో వేగంగా వస్తున్నాయని దీంతో చిన్న పిల్లలు, పశువులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు మట్టి మాఫియా ఆగడాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

## జాతీయస్థాయిలో రైఫిల్ షూటింగ్ పోటీలలో శశిధర్ నాయుడు సత్తాచాటాలి

**- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ఆకాంక్ష**



**మదనపల్లె,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా, మదనపల్లె పట్టణానికి చెందిన కోపూరి (సీడ్స్) మల్లికార్జున నాయుడు కుమారుడు కోపూరి శశిధర్ నాయుడు ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలోని రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రేంజ్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 26వ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు.ఈ నేపథ్యంలో ఆదివారం రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శశిధర్ నాయుడు రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలలో బంగారు పతకం సాధించి మదనపల్లె కీర్తిప్రతిష్టలను పెంచారన్నారు.ఇదే స్ఫూర్తితో ముందుకుసాగి భవిష్యత్తులో జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించి సత్తా చాటాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మహబూబ్ ఖాన్,తులసిధర్ నాయుడు పాల్గొన్నారు.

## ఉచిత న్యూరాలజీ మెడికల్ క్యాంప్

**- మారుమూల ప్రాంతాల ప్రజలు న్యూరాలజీ పై అవగాహన కలిగి ఉండాలి**

**- డాక్టర్ బిందు మీనన్**

**చిల్లకూరు , జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ బిందు మీనన్ ఫౌండేషన్ సహకారంతో నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం లోని చిల్లకూరు మండలం మన్నెగుంట గ్రామంలో ఉచిత న్యూరాలజీ మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మారుమూల ప్రాంతాల ప్రజలు న్యూరాలజీ పై అవగాహన కలిగి ఉండాలని, మూర్ఛ వ్యాధి, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం లక్షణాలను విసదీకరిస్తూ, వాటికి తక్షణముగా తీసుకొనవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 120 మంది నరాల సంబంధిత వ్యాధిగ్రస్తులను పరిశీలించి, వారికి వివిధ రకములైన టెస్టులు నిర్వహించి ఉచితముగా డాక్టర్ బిందు మీనన్ ఫౌండేషన్ ద్వారా మందులు ఇవ్వడం జరిగినది. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అక్కన రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి ఆర్ లయన్ గిరినాథ్, లయన్ మల్లెమాల మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్, మదనమేటి రమణయ్య, జక్కం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మనుబోలు రూపేష్ రెడ్డి, వీరేంద్రనాథ్, కళ్యాణ సాయి, ప్రముఖ అడ్వకేట్ లయన్ రజనీకాంత్ రెడ్డి, మహేష్, కె. శివయ్య, చింతల రాఘవయ్య మరియు జోసెఫ్ మొదలు వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి క్యాంప్ చైర్మన్గా లయన్ బ్రహ్మదేవి శీనయ్య మరియు ఆర్గనైజర్ గా మన్నెగుంట గ్రామస్తులు తిప్పరాజు శ్రీనివాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో గ్రామ ప్రజలు డాక్టర్ బిందు మీనన్ చే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## ఏఐ,రోబోటిక్స్‌లో భవిష్యత్‌కు బాటలు వేస్తున్న మిట్స్ యూనివర్సిటీ

**- బీటెక్ సి.ఎస్.ఈ ఏఐ,రోబోటిక్స్ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం**



**మదనపల్లె/ కురబలకోట, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 2026--27 విద్యా సంవత్సరానికి బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్) కోర్సులో ప్రవేశాలు ప్రారంభమైనట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ తెలిపారు.ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,రోబోటిక్స్,మెషిన్ లెర్నింగ్,ఆటోమేషన్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాలకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో విద్యార్థులను భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ప్రత్యేక కోర్సును రూపొందించినట్లు తెలిపారు.ఈ కోర్సులో పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ఆధునిక పాఠ్యాంశాలు,అనుభవజ్ఞులైన అధ్యాప కులు,అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశ్రమలతో అనుసంధానమైన ఇంటర్న్‌షిప్ అవకాశాలు, పరిశోధన మరియు రియల్ టైమ్ ప్రాజెక్టులపై ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజనీర్,రోబోటిక్స్ ఇంజనీర్,మెషిన్ లెర్నింగ్ స్పెషలిస్ట్, ఆటోమేషన్ ఇంజనీర్,డేటా సైంటిస్ట్ వంటి అత్యున్నత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు.ఈ కోర్సుకు ఇంటర్మీడియట్ (10o2) ఎంపీసీ పూర్తి చేసి కనీసం 50 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.అర్హత ఆధారంగా ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మిట్స్ యూనివర్శిటీ పౌండర్,ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి,వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి జనసేన కార్యకర్తల బయోడేటాల స్వీకరణ

**పీలేరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో జనసేన పార్టీ తరఫున పనిచేయాలని ఆసక్తి కలిగిన కార్యకర్తలు, నాయకులు తమ పూర్తి వివరాలతో కూడిన బయోడేటాలను సోమవారం నుండి రాజంపేట జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సమర్పించాలని పార్టీ నాయకత్వం కోరింది.పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ మరియు భవిష్యత్తు కార్యాచరణను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ఉన్న కార్యకర్తలు, నాయకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, పీలేరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ అబ్జర్వర్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలనే నిబద్ధత కలిగిన ప్రతి ఒక్కరూ తమ బయోడేటాలను తప్పనిసరిగా సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పీలేరులో విస్తృత పల్స్ పోలియో



**పీలేరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా నిర్వహించారు. ఆదివారం నాలుగు రోడ్ల కూడలి, బండ్లవంక, రాములవారి గుడి, మార్గదర్శి డిగ్రీ కళాశాల యల్ల మంద క్రాస్ అంగన్వాడీ కేంద్రం, పంచాయతీ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో పీలేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, ఎంపీడీవో శివశంకర్ పాల్గొని పర్యవేక్షించారు.వారు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనలతో పోలియో రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. పీలేరు పట్టణంలో ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ఇంటింటి సర్వే చేసి చుక్కలు వేస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రజలు, అధికారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పాత బస్టాండ్‌లోని మెయిన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ యుగంధర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇస్మాయిల్ షౌకత్ బుజ్జు, మనోహార తదితరులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు.పీలేరు నియోజకవర్గ గ్రామ గ్రామాన ఉదయం నుండి వైద్య సిబ్బంది కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో కొనసాగుతుంది.ఈ కార్యక్రమాల్లో శ్రీ అంకాలమ్మ ఆలయ చైర్మన్ కోడి రామకృష్ణారెడ్డి, టీడీపీ ప్రముఖ నేత పోలిశెట్టి సురేంద్ర ఏ సాపల సూరి, వైద్య సిబ్బంది, చంద్రశేఖర్, కుసుమ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దాం

**- ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష పిలుపు**



**మదనపల్లె,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కోళ్లబైలు పంచాయతీ లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జిల్లా వైద్య శాఖ అధికారి లక్ష్మీ నరసయ్య చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా, వాడ,వాడల నిర్వహిస్తోందన్నారు.ఆదివారం వేయించుకోవడం కుదరని వారు సోమ,మంగళవారంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు తమ చిన్నారి బిడ్డలకు వేయించి పోలియో మహమ్మారి నుండి రక్షణ పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు రాటకొండ భారతి,నాగమణి,శ్రీనివాసులు నాయుడు, బాలమాలి శేఖర్, జెసిబి వేణు, టీబీ విభాగ అధికారి ప్రభాకర్,సచివాలయ సిబ్బంది,ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం

**అనంతపురం,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసాం, ఎన్ని తిరిగి తీసుకున్నాం, అన్ని వివరాలు తెలియజేసారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఎల్ఏలను ఎక్కువ మందిని నియమించాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్, డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజు, తెలుగుదేశం ప్రతినిధి నారాయణస్వామి, బిజెపి ప్రతినిధి ఈశ్వర్ ప్రసాద్, జనసేన పార్టీ ప్రతినిధి కిరణ్ కుమార్, వైఎస్ఆర్సిపి ప్రతినిధి సోమశేఖర్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్ వలి, సిపిఐ (ఎం) ప్రతినిధులు బాలరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలు

**- ఏపీఎస్ఆర్టీసీ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి స్పష్టం**



**మదనపల్లె,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తల్లి,దండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు ఇవ్వాలని టిడిపి సీనియర్ నాయకులు, మదనపల్లె ఏపీఎస్ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 14వ వార్డు లో ఆయన చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ పోలియో ను సమూలంగా నిర్మూలించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య, సచివాలయ అంగన్వాడి సిబ్బందికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## పిఅర్సీ కమిటిని నియమించి,ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

**- ఎపి ప్రభుత్వ పెన్షనర్లు సంఘం మదనపల్లె యూనిట్ డిమాండ్**



**మదనపల్లె, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్లు సంఘం యూనిట్ సమావేశం స్థానిక జి.ఆర్.టి ఉన్నత పాఠశాల నందు అధ్యక్షులు బి.వి.రమణ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షులు జె.రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.మునిగోపాల క్రిష్ణ,ట్రెజరర్ పి.సి.తిమ్మయ్య,ఆర్గనైజింగ్ కార్యదర్శి జగన్మోహన్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసులు,ఉపాధ్యక్షులు మురళి,బషీర్,రాజన్నలు హాజరయ్యారు.ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే పిఅర్సీ కమిటిని నియమించాలని,ఐఆర్ 30శాతం మంజూరు చేయాలని,బకాయి పడ్డ నాలుగు డి.ఆర్ లు చెల్లించాలని,అడిషినల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ గత ప్రభుత్వం తగ్గించిందని,దానిని తిరిగి పునరుద్దరించాలని, సమాఖ్య ఉద్యమాన్ని బలపరచాలనే తీర్మానాలను ఏకగ్రీవంగా అమోదించారు.

## వెస్టీజ్ ఉత్పత్తులతో ఆరోగ్యం-ఆదాయం సాధ్యం



**మదనపల్లె,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు ఆర్థిక స్వావలంబనను సాధించేందుకు వెస్టీజ్ ఉత్పత్తులను వినియోగిస్తూ, వాటి వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని భవిష్యత్ వెస్టీజ్ డీలర్ పులి సత్యనారాయణ రెడ్డి అన్నారు.వెస్టీజ్ ఉత్పత్తుల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో మౌనిక నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, వెస్టీజ్ సంస్థ నాణ్యమైన ఆరోగ్య, వ్యక్తిగత సంరక్షణ, గృహోపయోగ ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్నదని తెలిపారు.ఈ ఉత్పత్తుల ను ఉపయోగించడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందడమే కాకుండా, ప్రత్యక్ష విక్రయ (డైరెక్ట్ సెల్లింగ్) విధానం ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా సంపాదించే అవకాశం ఉందని వివరించారు.యువత, మహిళలు, ఉద్యోగులు, రైతులు వంటి వివిధ వర్గాల ప్రజలు వెస్టీజ్ వ్యాపార అవకాశాలను వినియోగించుకొని తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కిషోర్ బాబు, భువనేశ్వర రెడ్డి, మల్లిక, రైతు వెంకటరమణ రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజానికి కృషి చేయాలి



**మదనపల్లె, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కృషి చేయాలని కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి పిలుపు నిచ్చారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కురవంక నందు చిన్నారు లకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పసుపులేటి చలపతి అక్కడికి వచ్చిన చిన్నారులను ఎత్తుకుని ఆప్యాయంగా ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి బంగారు జీవితాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచి పోలియో రహిత సమాజం నిర్మించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఇందుకోసం గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ప్రభుత్వాలు అందజేసే వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు,వైద్య, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రెండు చుక్కలతో జీవితాంతం రక్షణ

**పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి : జిల్లా కలెక్టర్**

**పుట్టపర్తి ,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రెండు పోలియో చుక్కలు – జీవితాంతం పిల్లలకు రక్షణగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు.ఆదివారం ఉదయం యెనుమలపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కొంతమంది చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలియో రహితసమాజ నిర్మాణమే లక్ష్యమని ఇందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. పిల్లలకు వేయించే ఈ రెండు చుక్కలు వారిని పోలియో బారిన పడకుండా జీవితాంతం రక్షిస్తాయన్నారు. భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర వైద్యారోగ్య శాఖలు ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ ప్రాణాంతక వ్యాధి నుండి శాశ్వత రక్షణను అందించడానికి ప్రత్యేక పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పోలియోను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసే విధంగా కార్యక్రమం నిర్వహణకు ముందస్తు చర్యలు తీసుకొని సిబ్బందికి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1011 పోలింగ్ బూతులలో సుమారు 1,76,283మంది పిల్లలకు ఈ పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రధాన కూడళ్లు బస్టాండ్లు , రైల్వేస్టేషన్, స్థానిక ప్రాథమిక కేంద్రాలు అంగన్వాడీలు మరియు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ, పట్టణ శివారు తదితర ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు ఉచితంగా పోలియో టీకాలు వేయడం జరుగుతున్నదన్నారు. దాదాపు 200 దేశాలలో పోలియో పూర్తిగా నిర్మూలించబడిందని అయితే ఒకటి లేదా రెండు దేశాల్లో ఇప్పటికీ ఈ వైరస్ ఉండడం వల్ల ప్రపంచం మొత్తం పోలియో రహితంగా మారే వరకు నిరంతర అప్రమత్తత, టీకాల పంపిణీ అవసరమని అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లలు అంగవైక ల్యాలకు గురికాకుండాకాపాడే విధంగా పల్స్ పోలియో బాధ్యతగా కార్యక్రమాలలో పాల్గొని విజయంతం చేయాలని కలెక్టర్ కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న వారు విధి నిర్వహణలో భాగంగా వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించద్దని సూచించారు.

# 60 లక్షల విలువైన 400 మొబైల్ ఫోన్ లు స్వాధీనం.

## బాధితులకు అందజేసిన కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు.



**మచిలీపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** దాదాపు 60 లక్షల విలువైన 400 మొబైల్ ఫోన్ లను మూడు నెలల కాలంలో రికవరీ చేసి రికార్డు సృష్టించడం అభినందనీయమని కృష్ణాజిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ నేటి ఆధునిక జీవితంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో విడదీయరాని భాగం అయిందన్నారు. వ్యక్తిగత సమాచారం బ్యాంకింగ్ సేవలు, విద్య, ఉద్యోగం వ్యాపారం, వంటి అనేక అవసరాలకు మొబైల్ ఫోన్ కీలక సాధనంగా మారిందని తెలిపారు. అలాంటి మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడం దొంగతనానికి గురికావడం లేదా ఇతర కారణాలతో కోల్పోవడం వల్ల బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు త్వరితగతిన సహాయం అందించాలని లక్ష్యంతో సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ను సమర్థవంతంగా వినియోగిస్తూ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోగొట్టుకున్న దొంగిలించబడిన లేదా ఇతర కారణాలతో కోల్పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించేందుకు సీసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం ఐటి కోర్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సీఐఆర్ పోర్టల్ ద్వారా ఐఎంఈఐ వివరాలను విశ్లేషించి వివిధ ప్రాంతాల్లో గుర్తించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందించడంలో విశేష కృషి చేస్తోందని కొనియాడారు. ఈ ప్రత్యేక చర్యల ఫలితంగా కేవలం మూడు నెలల కాలంలో మొత్తం 400 మొబైల్ ఫోన్లు సుమారు 60 లక్షల విలువైన వాటిని రికవరీ చేయడం జరిగిందన్నారు. వీటిలో మచిలీపట్నం సిసిఎస్ పరిధిలో 100, పెనమలూరు సిసిఎస్ పరిధిలో 63, గుడివాడ సిసిఎస్ పరిధిలో 237 మొబైల్ ఫోన్లను కనిపెట్టి రికవరీ చేయడం జరిగిందన్నారు. ఈ మొబైల్ ఫోన్లను కృష్ణాజిల్లా ఎస్పీ చేతులమీదుగా బాధితులకు అందజేశారు. ప్రజలు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్ లో కూడా వివరాలు నమోదు చేయాలన్నారు. దీంతో మొబైల్ ను బ్లాక్ చేయడంతో పాటు గుర్తించి తిరిగి అందించే ప్రక్రియ వేగవంతమవుతుందన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు కృష్ణా జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారన్నారు. మొబైల్ ఫోన్లు తిరిగి అందుకున్న బాధితులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమర్థవంతమైన సేవలు అందిస్తున్న కృష్ణా జిల్లా పోలీసులను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ అభినందించారు.

# జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి సమన్వయంతో చర్యలు చేపట్టాలి.!

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధితో పాటు ఎగుమతులను ప్రోత్సహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి), అనంతరం జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఈపిసి) సమావేశాలు నిర్వహించారు. డీఐఈపీసీ సమావేశంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల మంజూరు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపి) పురోగతి, పార్ట్నర్షిప్ సమ్మిట్--2025లో కుదిరిన అవగాహన ఒప్పందాల అమలు, జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ పునర్వ్యవస్థీకరణ, ఎంఎస్ఎంఈలకు వివిధ పారిశ్రామిక విధానాల కింద అందించే ప్రోత్సాహకాల మంజూరుపై సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను నిర్ణీత గడువులోగా మంజూరు చేసి, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జరిగిన డీఈపీసీ సమావేశంలో జిల్లా ఎగుమతుల గణాంకాలు, జిల్లా ఎగుమతుల కార్యాచరణ ప్రణాళిక, అధిక ఎగుమతి సామర్థ్యం కలిగిన ఉత్పత్తుల గుర్తింపు, భాగస్వామ్య సంస్థల సహకారం, ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాల విస్తరణ, ఎగుమతిదారుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. స్థానిక ఎంఎస్ఎంఈలు, కళాకారులు, రైతులు, పారిశ్రామికవేత్తలు ప్రపంచ మార్కెట్లను చేరుకునేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఎగుమతుల పెరుగుదల ద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశాల్లో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, తపాల శాఖ మచిలీపట్నం డివిజన్ సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు, మల్లవల్లి పరిశ్రమల అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్, ఇమిటేషన్ జ్యువలరీ పార్క్ ప్రెసిడెంట్ సుబ్బారావు, ఇతర పారిశ్రామికవేత్తలు, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు జ్యోతి రమణి, జే జ్యోతి, బ్యాంకుల ప్రతినిధులు, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు



**కావలి జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పోలియోను నివారించేందుకు ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ రెండు చుక్కల పోలియో వాక్సిన్ వేయించాలని ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ చేవూరు చిన్నా అన్నారు. భవిష్యత్తులో భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఆదివారం దళితవాడ అంగన్వాడీ కేంద్రం వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలను గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బంది జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, చుక్కలు వేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం యం.రేవతి, ఆశా వర్కర్ సీహెచ్ సౌజన్య, అంగన్వాడీ వర్కర్స్ కె.విజయలత సీహెచ్.విజయ్ కుమారి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

# ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి: ఎమ్మెల్యే



**కనిగిరి జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఈ రోజు పిల్లలకు పోలియో చుక్కలు వేయించని వారు.. సోమ, మంగళవారాలు డోర్ టూ డోర్ క్యాంపెయిన్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై దాడులు



**కురుపాం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నవోదయం 2.0 లో భాగంగా ఆదివారం ఆంధ్ర- ఒడిశా సరిహద్దులో ఉన్న అనిజ, వనివ పోలీసులు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 220 లీటర్ల నాటుసారాతో పాటు, 11 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. నాటుసారాపై సరిహద్దులో నిరంతరం నిఘా పెడుతున్నామని, అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు చేస్తున్నట్లు తెలిస్తే 63029 36599 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో విజయనగరం, సీతానగరం, చీపురుపల్లి, పార్వతీపురం ఎక్సైజ్, టాస్క్ ఫోర్సు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి కానుకగా వెండి బిందె అందజేత



**నిడదవోలు జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి కానుకగా వెండి బిందెను అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన పైడేటి సత్యనారాయణ - అలివేలు మంగతాయారు దంపతుల కుమారులు పైడేటి తేజ, లక్ష్మణ్ 1.062 కేజీల వెండి బిందెను ఆలయాధికారులకు అందజేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్వీకేఏ శర్మ, ఆలయ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమం




**భీమునిపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జీవీఎంసీ 4 వవార్డు పరిధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో శ్రీ కనక మహాలక్ష్మి దేవాలయం డైరెక్టర్ టి డి పి సీనియర్ నాయకులు గరికిన.ఎల్లయ్య (కింగ్) పాల్గొని చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని పోలియో రహితంగా ఉంచడంలో పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం యువత ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాంతీయ ఆసుపత్రి సేవలు అభినందనీయం: మంత్రి కొండపల్లి



**విజయనగరం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గజపతినగరంలోని ప్రాంతీయ ఆసుపత్రి సేవలు అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం పల్స్ పోలియో సందర్భంగా గజపతినగరంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 0-5 ఏళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. గజపతినగరం ఆసుపత్రి రాష్ట్రంలోనే నాలుగో స్థానాన్ని దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న గజపతినగరం వైద్య బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రిలో మాత్రమే చేసే మోకాలి చికిత్సను గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేసి నూతన ఒరవడిని సృష్టించారన్నారు. ఆసుపత్రిలోని పలు విభాగాలు పరిశీలించడంతోపాటు రోగులను పరామర్శించారు. మంత్రి వెంట తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాల రాజు, మక్కువ శ్రీధర్, ప్రదీప్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



**కవిటి జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జమేదారిపుట్టుగ వద్ద జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో బ్రహ్మపుర వెళ్లేందుకు ఆగి ఉంది. ఈ క్రమంలో పలాస వైపు నుంచి వస్తున్న లారీ ఆటోని ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు మురపాల పార్వతి, నర్తు పద్మమ్మ, మండపల్లి తరినమ్మగా గుర్తించారు. ప్రమాదంపై కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలియో రహిత దేశమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి..!




**భీమునిపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజా ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, గంటా నూకరాజు అన్నారు. పల్స్ పోలియో సందర్భంగా భీమిలి జోన్ 3వ డివిజన్ బోయవీధి, ఎగువపేట, నేరళ్లవలస కోలనీ, ప్రభుత్వ ఆసుపత్రిలలో జరిగే కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యులు కళ్యాణచక్రవర్తి, కల్యాణిలతో పాటు వైద్య సిబ్బందితో పాల్గొని 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్య క్రమంలో ఏఎన్ఎమ్ భవానితో శ్రీ నూకాలమ్మ ధర్మకర్తల మండలి చైర్మన్ చురకల రమణ, తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాసుపుస్తకాలకు 'బ్లాక్ చెయిన్'



**కోటబొమ్మాళి, జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గతంలో రీసర్వే పేరుతో గొడ్డలి పార్టీ సృష్టించిన భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పట్టాదారు పాసు పుస్తకాలకు బ్లాక్ చెయిన్ సాంకేతికతను వర్తింపజేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. కోటబొమ్మాళి తహసీల్దారు కార్యాలయంలో కస్తూరిపాడు, దంత పంచాయతీల రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఉపయోగించిన తర్వాత పుస్తకం యజమాని అంగీకారం(ఓటీపీ) లేకుండా ఎలాంటి మార్పు చేయడానికి వీలుండదన్నారు. క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్ ఇలా ప్రతి అంశానికి యజమాని అవసరం ఉంటుందని వివరించారు. వైకాపా హయాంలో ప్రభుత్వ భూములని తెలిసినా ప్రైవేటు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించేశారని మంత్రి ధ్వజమెత్తారు. భూహక్కు చట్టం ద్వారా రైతుల భూముల తనఖాకు సర్వం సిద్ధం చేయగా.. కూటమి విజయంతో దానికి అడ్డుకట్ట పడిందన్నారు. రాష్ట్రంలో ఇనాం భూముల సమస్యల పరిష్కారానికి జిల్లా నుంచే శ్రీకారం చుడతామన్నారు. అనంతరం తహసీల్దారు ప్రసాదరావు మంత్రిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆర్డీవో కృష్ణమూర్తి, రాష్ట్ర కళింగకోమట్ల కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, కింజరాపు ప్రసాదరావు, పార్టీ మండలాధ్యక్షుడు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

# వ్యర్థ జలాలను చెరువులో వదలకుండా చర్యలు తీసుకోవాలి



**అనకాపల్లి జూన్ 28 మెట్రో వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామం ఆనుకొని 450 ఎకరాలు ఉప్పుటేరు ఉంది ఆ ఉప్పుటేరు లో హెట్రో డ్రగ్స్ కంపెనీ వారు వాడే వ్యర్థ రసాయన జలాలు నేరుగా చెరువులో కలపడం జరుగు తుంది. ఈ ఉప్పు టేరు మీదే రాజయ్య పేట, దొండవాక , జానకియ్యపేట, పెద్దతీనార్ల ,ఈ చుట్టుపక్కల ఉన్న గ్రామాలు అన్ని చెరువు పై వేటనిసేది సమయంలో ఆ రెండు నెలల్లో చెరువు మీద ఆధారపడి జీవన ఉపాధి సాగేది అదే విధంగా వర్షాకాలంలో కూడా దీని మీద ఆధారపడి బ్రతికేవాలు అలాంటి చెరువుని ఇప్పుడు హెట్రో యాజమాన్యం వారు ఈ చెరువుని డంపింగ్ యార్డ్ లాగా తయారు చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏదైతే ఈ వ్యర్థ రసాయన జలాలను వదులుతున్నారు ఆ వ్యర్థ జలాలను ఈ చెరువులో వదలకుండా చర్యలు తీసుకోవాలని సొంత నియోజకవర్గమైన హోమ్ మినిస్టర్ గారిని అదేవిధంగా పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ గారిని కలిసి వినతిపత్రం ఇవ్వడు జరుగుతుంది ఇందులో పాల్గొన్నవారు fdo పి శృతి గారు, విలేజ్ స్పెషల్ ఆఫీసర్ శివాజీ గారు, మైలపల్లి మహేష్ బాబు,కాళ్ళ దేముడు, మైలపల్లి బైరాగిరాజు, బొండలపు అప్పలరాజు, కోడా కాశీరావు తదితరులు పాల్గొన్నారు

# ఘట్టమనేని వారసుడి వెనుకడుగు ఎందుకంటే



ఘట్టమనేని మూడో తరం వారసుడు జయకృష్ణ డెబ్యూ మూవీ శ్రీనివాస మంగాపురం జూలై 9 విడుదలని మొన్నటి దాకా టీమ్ ప్రచారం చేస్తూ వచ్చింది. అయితే హఠాత్తుగా ప్రమోషన్లు ఆగిపోవడంతో పాటు ప్రీ రిలీజ్ ఈవెంట్ కు సంబంధించిన అప్డేట్స్ రాకపోవడంతో అభిమానుల్లో అనుమానం మొదలయ్యింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సినిమా వాయిదా పడింది. జూలై చివరి వారం లేదా ఆగస్ట్ ఫస్ట్ వీక్ థియేటర్ రిలీజుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు కాని ఒకవేళ నిజమైతే మటుకు మంచిదే అనుకోవాలి. ఎందుకంటే జూలై 10 లెనిన్ వస్తోంది. అన్నపూర్ణ, సితార సంస్థలు చాలా ప్రెస్టీజియస్ గా దీన్ని రిలీజ్ చేస్తున్నాయి. ట్రయిలర్ వచ్చాక అంచనాలు పెద్ద ఎత్తున పెరుగుతాయని అంటున్నారు. దీనికి వారం ముందు జూలై 3న రావు బహదూర్, నాగబంధం వస్తున్నాయి. కంటెంట్ పరంగా రెండూ మంచి హైప్ పెంచుకుంటున్నాయి. వీటి మధ్య జయకృష్ణ పోరాడాల్సి ఉంటుంది. దానికి తోడు కేవలం పది రోజుల వ్యవధిలో ఈవెంట్లు చేసి, బజ్ పెంచి ఓపెనింగ్స్ తెచ్చుకోవడం అంత సులభం కాదు. పైగా ఈవెంట్ కు వచ్చేందుకు మహేష్ బాబు కూడా అందుబాటులో లేరని టాక్. ఇంత పోటీ మధ్య ఇబ్బంది పడటం కంటే సేఫ్ గా మరోసారి రావడం మంచిదేనని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. గ్రౌండ్ లెవెల్ లో చూసుకుంటే శ్రీనివాస మంగాపురం మీద ఏమంత సౌండ్ లేదు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే కొంచెం లేట్ అవ్వడం ఒకరకంగా సేఫ్ గేమని చెప్పాలి. పైగా కొత్త హీరో హీరోయిన్, స్టార్ డైరెక్టర్ లేకపోవడం లాంటి అంశాలు మార్కెట్ పరంగా కొంత ప్రభావం చూపిస్తున్నాయి. మంగళవారం సక్సెస్ అయ్యింది కానీ మరీ పెద్ద స్థాయిలో కాదు. అందుకే అజయ్ భూపతి బ్రాండ్ కొంతమేర పని చేస్తోంది. మోహన్ బాబు కీలక పాత్ర పోషించిన ఈ లవ్ డ్రామా తిరుపతి బ్యాక్ డ్రాప్ లో జరుగుతుంది. లవ్ స్టోరీ అయినప్పటికీ కమర్షియల్ ఎలిమెంట్స్ కి లోటు లేకుండా జాగ్రత్త వహించారట. జివి ప్రకాష్ కుమార్ దీనికి సంగీతం సమకూర్చారు.

# కోట్లు పెట్టినా రాని పబ్లిసిటీ... టైటిల్‌తో



ప్రమోషనల్ కంటెంట్‌తో వస్తే తప్ప ప్రేక్షకుల చూపు వాటి మీద పడదు. చిన్న చిత్రాల పబ్లిసిటీ కోసం కొందరు కావాలని వివాదాలు రాజేయడమూ చూస్తున్నాం. కానీ ఇప్పుడో సినిమా టైటిల్ విషయంలో అనుకోకుండా తలెత్తిన వివాదం దానికి వరంగా మారింది. షూటింగ్ కూడా మొదలు కాకముందే ఆ చిత్రానికి కావాల్సినంత పబ్లిసిటీ వచ్చింది. ఆ చిత్రమే.. ఇడుపు కాయితం. సుకుమార్, బన్నీ వాసు కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి, యూట్యూబ్ స్టార్ నాగదుర్గ ఇందులో జంటగా నటిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రానికి ముహూర్త వేడుక నిర్వహించి.. టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు ఐతే 'ఇడుపు కాయితం' అన్న టైటిల్ చాలామందికి అర్థం కాలేదు. తెలంగాణ పల్లెటూళ్లలో విడాకుల పత్రాన్ని వాడుకు భాషలో 'ఇడుపు కాయితం' అంటారు. ఆంధ్ర వాళ్లకే కాదు.. తెలంగాణ అర్బన్ ఏరియాల వాళ్లకు కూడా ఈ టైటిల్ అర్థం కాలేదు. ఐతే భాషలో మరుగునపడ్డ ఎన్నో పదాలు ఉంటాయి. వాటిని ఇలా పరిచయం చేయడం, జనాలకు అలవాటు చేయడం మంచిదే. ఐతే ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు సోషల్ మీడియాలో ఈ టైటిల్ మీద వెటాకారాలడడం.. ఈ సినిమాకు సబ్ టైటిల్స్ పెడతారా అంటూ కౌంటర్లు వేయడంతో వివాదం మొదలైంది. దీని మీద తెలంగాణ వాళ్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నటుడు రాహుల్ రామకృష్ణ లాంటి ప్రముఖులు కూడా దీనిపై విమర్శలు గుప్పించారు. ఇది ప్రాంతీయ విద్వేషాలకు, విభేదాలకు దారి తీసే స్థాయిలో వివాదంగా మారింది. ఐతే అచ్చమైన తెలంగాణ పల్లెటూరి కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో హీరోయిన్లు, దర్శకుడు తెలంగాణ వారు కాగా.. దాన్ని నిర్మిస్తోంది ఇద్దరు ఆంధ్రులు అన్న సంగతి మరువరాదు. టైటిల్ మీద వెటకారాలాడడం కచ్చితంగా తప్పే. కానీ సోషల్ మీడియాలో ఎవరో చేసిన పిచ్చి కామెంట్ల మీద ఇంత గొడవ కూడా అవసరం లేదు. ఈ గొడవకు ఇంతటితో తెరదించాల్సిన అవసరముంది. ఈ వివాదం వల్ల చిత్ర బృందానికైతే బాగానే లాభం జరిగింది. కోట్లు పెట్టినా రాని పబ్లిసిటీ వచ్చింది. ఓపెనింగ్స్‌కు ఇది బాగా కలిసొస్తుందనడంలో సందేహం లేదు. చిన్న సినిమాలను జనాల్లోకి తీసుకెళ్లడం, థియేటర్లకు రప్పించడం ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. క్రేజీ సినిమాలో విషయం ఉంటే.. 'బలగం'లా అందరి మన్ననలూ పొందవచ్చు.




# బుచ్చిబాబు అడుగులు ఎటు వెళ్తాయి




పెద్ది థియేటర్ రన్ ఈ సండేతో ముగిసినట్టే. నాలుగో వారంలో ఓ మోస్తరుగా ఆడుతోంది కానీ వీక్ డేస్ లో చెప్పుకోదగ్గ వసూళ్లు లేవు. మా ఇంటి బంగారం అనూహ్యంగా హిట్ కావడం పెద్దికి మైనస్ అయ్యింది. రామ్ చరణ్ లండన్ వెళ్లి అక్కడ ప్రమోషన్లలో బిజీగా ఉన్నాడు. ముందే ప్లాన్ చేసుకున్న షెడ్యూల్ కావడంతో దానికి అనుగుణంగా టూర్ కొనసాగుతోంది. ఇప్పుడు అందరి చూపు దర్శకుడు బుచ్చిబాబు మీదకు వెళ్తోంది. నెక్స్ట్ ఎవరితో చేస్తారనే ప్రశ్న ఆసక్తి రేపుతోంది. ఉప్పెన తర్వాత ఏకంగా ఐదేళ్ళు గ్యాప్ రావడం బుచ్చిబాబు మైనస్ గా ఫీలవ్వలేదు. ఎందుకంటే రామ్ చరణ్ తనను నమ్మి పెద్ది లాంటి భారీ ఆఫర్ ఇవ్వడం వల్ల. అంతేకాదు కథ డిమాండ్ మేరకు ఒళ్ళు హూనం చేసుకున్నాడు. విపరీతంగా కష్టపడ్డాడు. మూడు వందల కోట్లకు పైగా వసూళ్లు రావడంలో తనవంతు బాధ్యత పూర్తిగా నెరవేర్చాడు. కానీ ఓవర్సీస్, బాలీవుడ్, కేరళ తమిళనాడులో ఆశించిన ఫలితం రాకపోవడం బుచ్చిబాబు బ్రాండ్ మీద ప్రభావం చూపించింది. ఎందుకంటే రాజమౌళి, ప్రశాంత్ నీల్, రిషబ్ శెట్టి, సుకుమార్ లాంటి స్టార్ డైరెక్టర్లు హిందీలోనూ తమ జెండా పాతారు. బుచ్చిబాబు పెద్దితో ఈ లీగ్ లోకి వెళ్లిపోవచ్చని భావించారు. కానీ అలా జరగలేదు. మహేష్ బాబు తనతో చేయడం పట్ల ఆసక్తిగా ఉన్నాడనే ప్రచారం జరిగింది. కానీ వారణాసి తప్ప వేరే ప్రపంచం లేదన్నట్టు బిజీగా ఉన్న సూపర్ స్టార్ ఇప్పుడప్పుడే కథలు వినే ఉద్దేశంలో లేరట. సో ఎంతలేదన్నా ఇంకో ఏడాది వెయిటింగ్ ఎవరికైనా తప్పదు. విచిత్రంగా ఇప్పుడు బుచ్చిబాబు ముందు ఉన్న ఆప్షన్లు తక్కువే. జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్, నాని ఇంకో రెండు మూడు సంవత్సరాల వరకు దొరికేలా లేరు. పోనీ రామ్ చరణ్ ని మళ్ళీ ట్రై చేద్దామన్నా గురువు సుకుమార్ లాక్ చేసుకున్నారు. సో ఛాన్స్ లేదు. మీడియం రేంజ్ హీరోతో చేస్తే ఇమేజ్ తగ్గే రిస్క్ లేకపోలేదు. ఈ మీమాంసలో బుచ్చిబాబు ఇంకొంత కాలం వేచి చూసే ధోరణిలో ఉన్నట్టు తెలిసింది. తన టీమ్ ని ఖాళీగా ఉంచకుండా ఏకకాలంలో రెండు కథల మీద వర్క్ చేయిస్తున్నారట.



# బిజినెస్ న్యూస్



## విండోస్ 10 యూజర్లకు మైక్రోసాఫ్ట్ మరో ఏడాది ఊరట



విండోస్ 10కు గతేడాది మైక్రోసాఫ్ట్ తన సపోర్ట్ నిలిపివేసింది. విండోస్ 11కు హార్డ్‌వేర్ సపోర్ట్ చేయని వారు ఎక్స్‌టెండ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్‌లో చేరాలని అప్పట్లో సూచించింది. లేదంటే కొత్త డివైజ్‌కు మారాలని పేర్కొంది. వాస్తవానికి ఆ గడువు కూడా ఈ ఏడాది అక్టోబర్‌తో ముగియనుంది. ఈ క్రమంలో విండోస్ 10 యూజర్లకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. ఈఎస్‌యూ ప్రోగ్రామ్‌ను మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో కొత్త ఆపరేటింగ్ సిస్టమ్‌కు మారలేక, కొత్త పీసీకి అప్‌గ్రేడ్ అవ్వలేని వారికి ఉపశమనం కల్పించినట్లు అయ్యింది. ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్ కింద విండోస్ 10 కస్టమర్లు మరోఏడాది పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుకుంటారంటూ మైక్రోసాఫ్ట్ తన సపోర్టు పేజీలో రాసుకొచ్చింది. అంటే 2027 అక్టోబర్ వరకు సెక్యూరిటీ అప్‌డేట్స్ వస్తాయన్నమాట. ఇప్పటికే ఈఎస్‌యూలో చేరిన యూజర్లు.. కొత్తగా చేయాల్సింది ఏమీ ఉండదు. వాస్తవానికి మైక్రోసాఫ్ట్ విండోస్ 10ను లక్షలాది మంది వినియోగిస్తున్నారు. వారంతా 11కు అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలన్నది మైక్రోసాఫ్ట్ లక్ష్యం. ఏదైనా కారణం చేత విండోస్ 10లోనే కొనసాగాల్సి వస్తే.. డబ్బులు పెట్టి ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ (ఇఎస్‌యూ) ప్రోగ్రామ్ కింద సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు ఈ ఈఎస్‌యూ ప్రోగ్రామ్‌లో కేవలం సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రమే లభిస్తాయి. కొత్త ఫీచర్లు గానీ, డిజైన్ మార్పిడి రిక్వెస్టులు గానీ, నాన్ సెక్యూరిటీ రిక్వెస్టులు గానీ అందించదు.

## ఫ్లిప్‌కార్ట్ 'గోట్‌సేల్'.. ఐఫోన్ 17 సిరీస్‌పై భారీ డిస్కౌంట్స్




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ 'గోట్ సేల్' జులై 4న ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఐఫోన్‌లపై భారీ ఆఫర్లను ప్రకటించింది. ఐఫోన్ కొనుగోలు చేయాలనుకునే యూజర్లకు ఇది బంపర్ ఆఫర్‌గా మారనుంది. ఐఫోన్17 పై రూ.12 వేలు, ప్రో మోడల్స్‌పై రూ.22 వేల వరకు డిస్కౌంట్‌లను ఇస్తోంది. మెమొరీ చిప్ కొరత వల్ల రానున్న రోజుల్లో ఐఫోన్ ధరలు పెరిగే అవకాశం ఉన్నందున..ఈ సేల్ మంచి అవకాశం.

ఆఫర్‌లో భాగంగా..

ఐఫోన్ 17 రూ.82,900 ధరతో లాంచ్ అవ్వగా.. సేల్‌లో భాగంగా రూ.70,990కే పొందొచ్చు. అంటే రూ.12 వేల డిస్కౌంట్.

ఐఫోన్ 17 ప్రో ధర రూ.1,34,900 నుంచి ప్రారంభమవ్వగా.. సేల్‌లో రూ.1,12,900కు లభిస్తుంది. గరిష్ఠంగా రూ.22 వేల డిస్కౌంట్‌తో వస్తోంది.


ఈ సేల్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఐఫోన్ 17 ప్రో మాక్స్. రూ.22 వేల డిస్కౌంట్‌తో రూ.1,27,900కు సొంతం చేసుకోవచ్చు.

ఐఫోన్ 17ఈ ధర రూ.60,900, ఐఫోన్ ఎయిర్ ధర రూ.95,900, ఐఫోన్ 16 ధర రూ.59,900, ఐఫోన్ 16 ప్లస్ ధర రూ.73,900, ఐఫోన్ 16ఈ ధర రూ.55,900, ఐఫోన్ 15 ధర రూ.49,900 నుంచి ప్రారంభం కానున్నాయి.

అదనంగా బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ బోనస్, నో-కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ల ద్వారా ఐఫోన్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్ఎస్‌బీసీ క్రెడిట్ కార్డు హోల్డర్స్‌కు 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభించనుంది.

కొత్తగా ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్‌కార్డు తీసుకునేవారికి రూ.3 వేల వెల్‌కమ్ వోచర్లు లభిస్తాయి. ప్లస్ లేదా బ్లాక్ మెంబర్స్‌కు 24 గంటల ముందే (జులై 3) గోట్ సేల్ ఎర్లీ యాక్సెస్ పొందవచ్చు.

## ఆధార్, క్రెడిట్ కార్డులు.. జూలై 1 నుంచి కీలక మార్పులు



వచ్చే జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా పలు కీలక ఆర్థిక మార్పులు అమల్లోకి రానున్నాయి. ఇవి ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఆధార్ కార్డుదారులు, క్రెడిట్ కార్డు వినియోగదారులు, పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులు, బ్యాంకు ఖాతాదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా ఆధార్‌లో ఈమెయిల్ అప్‌డేట్‌కు ఉచిత అవకాశం, క్రెడిట్ కార్డుల రివార్డ్ పాయింట్లు, లాంజ్ యాక్సెస్ నిబంధనల్లో మార్పులు, పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు, బ్యాంకుల మిస్-సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి.

ఐటీఆర్ దాఖలుకు జూలై 31 చివరి తేదీ

2025-26 ఆర్థిక సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్ 2026-27) సంబంధించిన ఐటీఆర్-1, ఐటీఆర్-2 రిటర్నులు దాఖలు చేయడానికి జూలై 31, 2026 చివరి గడువు. గడువు దాటితే ఆలస్య రుసుములు, కొన్ని పన్ను విధానాలను ఎంచుకునే అవకాశాలపై పరిమితులు, అర్హత ఉన్న నష్టాలను తదుపరి సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేయడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

ఆధార్‌లో ఈమెయిల్ అప్‌డేట్

యూఐడీఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఆధార్ మొబైల్ యాప్ ద్వారా నమోదిత ఈమెయిల్ చిరునామాను అప్‌డేట్ చేసుకునే సేవను పూర్తిగా ఉచితంగా అందించనుంది. దీని కోసం ఇప్పటి వరకు రూ.75 రుసుము ఉండేది. అయితే ఈ రాయితీ కేవలం అధికారిక ఆధార్ మొబైల్ యాప్ ద్వారా చేసే అప్‌డేట్‌లకే వర్తిస్తుంది.

ఎస్‌బీఐ కార్డుల రివార్డ్ నిబంధనల్లో మార్పులు ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ూఖ౯ూజు, ూజుూజుజు దీూజఖ కార్డులకు సంబంధించిన రివార్డ్ పాయింట్ల విధానంలో మార్పులు అమల్లోకి రానున్నాయి. రివార్డ్ పాయింట్లు పొందే లావాదేవీలపై కొత్త పరిమితులు విధించడంతో పాటు, పాయింట్లు లభించని లావాదేవీల జాబితాను కూడా విస్తరించారు.

హెచ్‌డీఎఫ్‌సీ లాంజ్ యాక్సెస్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డుదారులు ప్రతి క్యాలెండర్ త్రైమాసికంలో మూడు ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సందర్శనలను పొందాలంటే, అంతకుముందు త్రైమాసికంలో కనీసం రూ.60,000 ఖర్చు చేసి ఉండాలి. ఉదాహరణకు జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి లాంజ్ సదుపాయం పొందాలంటే ఏప్రిల్-జూన్ మధ్య ఈ ఖర్చు పూర్తిచేయాల్సి ఉంటుంది.

పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు

జూలై 1 నుంచి సాధారణ, తత్కాల్ పాస్‌పోర్ట్‌ల ఫీజులు పెరుగుతున్నాయి. తాజా నోటిఫికేషన్ ప్రకారం 36 పేజీల సాధారణ పాస్‌పోర్ట్ ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కు, తత్కాల్ ఫీజు రూ.3,500 నుంచి రూ.5,000కు పెరిగింది. ఇతర కేటగిరీల ఫీజులను కూడా కేంద్ర ప్రభుత్వం సవరించింది.

బ్యాంకుల మిస్-సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కఠిన చర్యలు

బ్యాంకులు ఆర్థిక ఉత్పత్తులను తప్పుదోవ పట్టిస్తూ విక్రయించే ఘటనలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తెస్తోంది. ఈ నిబంధనల ప్రకారం మిస్-సెల్లింగ్‌కు గురైన వినియోగదారులు పూర్తి రీఫండ్‌తో పాటు జరిగిన నష్టానికి తగిన పరిహారం పొందే హక్కు కలిగి ఉంటారు. బ్యాంకులు ఉత్పత్తుల విక్రయంలో మరింత పారదర్శకత పాటించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు కూడా జూలై 1 నుంచే అమల్లోకి వస్తాయి.

## 150 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు షాక్.. అందరూ లేఆఫ్

అమెరికాకు చెందిన రిటైల్ టెక్నాలజీ సంస్థ హైవీ (ఎఎ-ఎవవ) భారత్‌లోని తన ఇంజినీరింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా మూసివేయడంతో సుమారు 150 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒక్కరాత్రిలోనే ఉద్యోగాలు కోల్పోయారు. ఉద్యోగులను రాత్రి 9 గంటలకు మైక్రోసాఫ్ట్ టీమ్స్ వీడియో కాల్‌కు ఆహ్వానించిన సంస్థ, రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా భారత ఇంజినీరింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఉద్యోగులకు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే వారి కార్పొరేట్ యాక్సెస్ కూడా నిలిపివేయబడింది. ఈ ఘటనపై మాజీ ఉద్యోగి ఒకరు రెడ్డిట్‌లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఇంటర్న్‌గా చేరి దాదాపు రెండేళ్లలో పూర్తి స్థాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎదిగిన తాను, "ఒక్క సమావేశంతో అంతా ముగిసిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా సంస్థ నుంచి సెవరెన్స్ ప్యాకేజీ లేదా ఎటువంటి ఆర్థిక పరిహారం కూడా అందలేదని పేర్కొన్నాడు. రియాక్ట్, నోడ్ జేఎస్, జావా స్క్రిప్ట్, టైప్ స్క్రిప్ట్ వంటి టెక్నాలజీల్లో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ, ఒక్కసారిగా ఉద్యోగం కోల్పోవడం తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిందని తెలిపాడు. ఈ అకస్మాత్తు తొలగింపులపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఉద్యోగులకు కనీస నోటీసు లేకుండా మొత్తం టీమ్‌ను తొలగించడం చట్టబద్ధమేనా? అనే ప్రశ్నలు నెటిజన్లు లేవనెత్తుతున్నారు. కొందరు ఉద్యోగుల ఆరోపణల ప్రకారం, తొలగింపుల అనంతరం సంస్థ భారత విభాగానికి సంబంధించిన లింక్డ్‌ఇన్ పేజీతో పాటు పలు పోస్టులను కూడా తొలగించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై సంస్థ అధికారికంగా స్పందించలేదు.

## తిరుపతిలో ఘనంగా ప్రారంభమైన ఐసిఏఐ సిఏ క్రికెట్ లీగ్

### -పోటీలను ప్రారంభించిన శాప్ చైర్మన్ రవి నాయుడు



**తిరుపతి,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఏఐ) ఆధ్వర్యంలో సిఏ క్రికెట్ లీగ్–2026 పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ ప్లే టుగెదర్–కంపీట్ టుగెదర్ ,సెలబ్రేట్ టుగెదర్ అన్న స్ఫూర్తిదాయక నినాదంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ క్రీడాస్ఫూర్తిని, స్నేహభావాన్ని, జట్టుగా పనిచేసే తత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. వృత్తిపరమైన బాధ్యతలతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్లు తమ వృత్తి జీవితంలో ఎంత క్రమశిక్షణతో వ్యవహరిస్తారో, అదే ఉత్సాహం మరియు క్రీడాస్ఫూర్తితో మైదానంలోనూ ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న ఐసిఏఐ నిర్వాహకులను, పోటీల్లో పాల్గొంటున్న అన్ని జట్లను, క్రీడాకారులను ఆయన అభినందించారు. అనంతరం స్వయంగా బ్యాటింగ్ చేసి క్రికెట్ లీగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ కార్యవర్గ సభ్యులు సింహాద్రి మన్నెం, బాలాజీ కామిశెట్టి, నరేంద్ర మాడపాటి, తిరుమలేష్ నాయుడు, మధనమోహన రెడ్డి, మధుసూదన బాబు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### - జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు

**తిరుపతి,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 39 వ వార్డ్ చెన్నారెడ్డి కాలనీ, 38 వవార్డ్ కేబి లేఔట్, 18 వ వార్డ్ మారుతి నగర్ లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు ఆదివారం ఉదయంపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇంటర్న్యూ రివిజన్ ప్రక్రియ ను వేగవంతం చేసేందుకు అధికారులు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు ప్రతి ఇంటికి వెళ్లి 2002 ఓటర్ల జాబితా తో సపోల్చి ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలన్నారు, ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల ముందస్తు నివారణ చర్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్ష

**తిరుపతి,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాబోయే రెండు, మూడు నెలల కాలంలో వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ఆదేశించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరియు మున్సిపాలిటీ అధికారులతో కలిసి ఆదివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి సురేష్ కుమార్ పలు కీలక సూచనలు చేశారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరియు మున్సిపల్ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని మురుగుదొడ్లు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిరంతరం శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, కలుషిత నీటి నివారణకు డ్రైనేజీల సమీపంలో వాటర్ పైప్‌లైన్లు లీకేజీ అవ్వడం వల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ఎక్కడా నీరు, ఆహారం కలుషితం కాకుండా నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. దోమల నివారణకు నిల్వ నీటి తొలగింపు చేపట్టాలని, ఇళ్ల పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా పర్యవేక్షించాలన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది, తద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రమాదకరమైన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు విస్తృతంగా చేపట్టాలన్నారు. సమావేశంలో భాగంగా, తిరుపతి జిల్లాకు సంబంధించిన అధికారిక డేటా ఆధారంగా గత మూడేళ్లలో నమోదైన డెంగ్యూ, చికెన్ గున్యా, మరియు మలేరియా కేసుల వివరాలను పరిశీలించారు. రాబోయే రోజుల్లో కేసులు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం కోసమే ఈ విశ్లేషణ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.. ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ: ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు అత్యంత శ్రద్ధ వహించాలని. ఎటువంటి లోపాలు లేకుండా, క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధులను పూర్తిగా అరికట్టేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పొడిగా, శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి విషయంలో జాగ్రత్తలు వహించి ప్రభుత్వానికి, ఆరోగ్య శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## జాతీయ పల్స్ పోలియో కేంద్రాల్లో స్కాట్స్ అండ్ గైడ్స్ సేవలు

**శ్రీకాళహస్తి రూరల్, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సేవలందించారు. భాస్కర్‌పేట మునిసిపల్ పాఠశాలకు చెందిన 30 మంది స్కాట్స్, గైడ్స్ విద్యార్థులు వియ్యాంపల్లి అంగన్‌వాడీ కేంద్రం, హనుమాన్ జంక్షన్, సాలిపేట శ్రీరామ మందిరం, భాస్కర్‌పేట మునిసిపల్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో ఆదివారం విధులు నిర్వహించారు. చిన్నారులను పోలియో చుక్కలు వేయించేందుకు కేంద్రాలకు తీసుకురావడం, తల్లిదండ్రులకు పల్స్ పోలియో ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం, కేంద్రాల్లో సహాయక చర్యలు చేపట్టడం వంటి సేవలు అందించారు. ఏపీజే అబ్దుల్ కలాం ఓపెన్ ట్రూప్ స్కాట్ మాస్టర్ ఎస్.కె. అజారుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవలను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అభినందించారు.




## గంగమ్మ సేవలో న్యాయమూర్తులు



**చౌడేపల్లి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానమునకు నలుగురు న్యాయమూర్తులు వచ్చి దర్శించుకున్నారు హైకోర్టు న్యాయమూర్తులు మహేశ్వర రావ్ శేఖర్ చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జయసూర్య జిల్లా జడ్జి అరుణ సారిక అమ్మవారి దర్శనార్థము విచ్చేసినారు. ఈ కార్యక్రమములో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఏకాంబరం అమ్మవారి దర్శనము కల్పించి తీర్థ ప్రసాదములు అందజేసినారు.

## తిరుమలలో పల్స్ పోలియో

### - 5255 మంది పిల్లలకు పోలియో చుక్కలు



**తిరుమల, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయం వద్ద ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పిల్లలకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. టిటిడి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ఎస్.కుసుమ కుమారి ఆధ్వర్యంలో తిరుమలలో 25 ప్రాంతాలలో పల్స్‌పోలియో కేద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో శ్రీవారి ఆలయంతో కలిపి 21 ప్రాంతాలలో భక్తులకు, 4 ప్రాంతాలలో స్థానికులకు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో భక్తులు మరియు స్థానికులు 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కాగా అశ్విని ఆసుపత్రి, జియన్‌సి, ఆర్‌టిసి బస్టాండ్, సిఆర్ఓ, పిఏసి 1 మరియు 2, ఎమ్‌బిసి–34, వైకుంఠం 1 మరియు 2, హెల్త్ ఆఫీసు, ఎటిసి, మేదరమిట్ట, వరాహస్వామి, రాంభగీఛ అతిథి గృహలవద్ద, శ్రీవారి ఆలయం లోపల, కల్యాణకట్ట, బాలాజీ నగర్, టిటిడి ఉద్యోగుల డిస్పెన్సరి ఎస్.వి. హైస్కూల్, పాపావినాశనం, అలిపిరి కాలినడక మార్గంలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో కలిపి మొత్తం 5255 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణి, ఎస్ఎంవో డాక్టర్ సుహర్లత, వైద్యులు డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మజ, హెడ్ నర్స్ పుష్పలత, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## "జినోమ్ హబ్"కి అపూర్వ స్పందన



**తిరుపతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలో "జిని పవర్ఎక్స్, ఇంపాక్ట్ క్యాటలిస్ట్" సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జినోమ్ హబ్ వైద్య పరీక్షలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఆ సంస్థ డైరెక్టర్లు మద్దూరి విజయ్, మబ్బు జ్యోత్స్నరెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి కరకంబాడీ రోడ్డులోని ఓ ప్రవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన "జినోమ్ హబ్" వైద్య పరీక్షలు మరియు అవగాహన కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని ఆమె పేర్కొన్నారు పెద్ద మొత్తంలో ఖర్చు అయ్యే వైద్యపరీక్షలను తిరుపతి ప్రజలకు, తక్కువ ఖర్చుతో చేయడానికి ముందుకు వచ్చిన తమను ప్రజలు ఆదరించడం సంతోషంగా ఉందన్నారు. జినోమ్ పరీక్షలు చేసుకోవడం ద్వారా ప్రతి మనిషిలో వారికి తెలియని జబ్బులు కానీ, భవిష్యత్తులో వచ్చే జబ్బులను గానీ ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఆ జబ్బు నయం కావడం కోసం ఎలాంటి మందులు వాడాలనేది కూడా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. లాభాపేక్షతో కాకుండా, సమాజ హితం కోసం, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయంగా తాము ముందుకు అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నగరంలో తమ సంస్థ ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కేవలం 30 వేల రూ.లతో ఈ పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చెసుకోవడం ఆనందంగా వుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం.ల వరకు ప్రజలకు వైద్యసేవలు అందించిన తర్వాత, సాయంత్రం 6 గం.ల నుంచి రాత్రి 9 గం.ల వరకు నగరంలోని పలువురు వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు, డా.కళ్యాణ్ ఉప్పలూరి, డా.హిమ చల్లా పాల్గొన్నారు. వీరితోపాటు టీడీపీ సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, బట్టు రవిశంకర్ రెడ్డి, మబ్బు రాహుల్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, శ్రీమన్నారాయణ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు నరసింహ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన జ్యేష్ఠాభిషేకం



**తిరుమల, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేకం ఆదివారం ఘనంగా ముగిసింది. చివరిరోజు ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్పస్వామివారు బంగారు కవచంలో పునః దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. శ్రీమలయప్ప స్వామివారికి, దేవేరులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు సదాశివరావు, జానకి దేవి ,సుచిత్ర ఎల్లా, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## కిల్లి రవి మృతి కేసుపై సిట్ ఏర్పాటు చేయాలి

### -సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ వినతి

**తిరుపతి,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రేణిగుంటకు చెందిన రైల్వే ఉద్యోగి కిల్లి రవి అనుమానాస్పద మృతి కేసులో దాగి ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే లిప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను ఏర్పాటు చేయాలని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయప్పనేని హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు, తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో రేణిగుంట డీఎస్పీ ద్వారా తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిల్లి రవి మరణానికి ముందు, తరువాత జరిగిన పరిణామాలు, ఆయన రాసిన సూసైడ్ నోట్‌లో చేసిన ఆరోపణలు, తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్, రేణిగుంట పోలీస్ స్టేషన్‌ల పాత్రపై వ్యక్తమవుతున్న అనుమానాలను స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక స్థాయిలో కాకుండా, రాష్ట్ర స్థాయి సీనియర్ అధికారులతో కూడిన సిట్ ద్వారా మాత్రమే ఈ కేసులోని అన్ని కోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తక్షణమే సిట్‌ను ఏర్పాటు చేసి, సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి కి,ఉప ముఖ్యమంత్రి కి,హోం మంత్రి కి,హెచ్‌ఆర్‌డీ మంత్రి కి కూడా ఈ విషయమై మెమోరాండంను ఈ–మెయిల్ ద్వారా పంపించడం జరిగిందని తెలియజేసారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా, అలాగే ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత బలపడేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రైల్ మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షులు ఎస్.మీరయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.జాకీర్, నాయకులు ఎస్.నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో పోలియో అంతరించినా జాగ్రత్తలు తప్పనిసరి

### -రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్ -పిల్లల భవిష్యత్తుకు రక్షణ కవచం.. రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్

### -జిల్లాలో 2,59,843 మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించనున్నాం -జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి,జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశ వ్యాప్తంగా పోలియో వ్యాధిని సమూలంగా నివారించే దిశగా 0–5 సం .ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తిరుపతి లోని ఎం ఆర్ పల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ వద్ద వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, స్థానిక ఎం ఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు లు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో జెసి ఆర్ గోవిందరావు, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శారదా దేవి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ సదాశివ, డి ఎం అండ్ హెచ్ వో బాలకృష్ణ నాయక్, ఆర్డీఓ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 0–5 సంవత్సరాల లోపు పిల్లలకు 2 చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించడం ద్వారా భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా తయారు చేయగలమని పేర్కొన్నారు. ఇప్పటికే భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా ఇంకా



పోలియో ప్రభావం ఉండడం, ఇతర దేశాల నుండి మన దేశానికి ప్రజలు రాకపోకలు జరుపుతున్న నేపథ్యంలో పోలియో వైరస్ పట్ల మరి కొన్ని సంవత్సరాలు జాగ్రత్త వహించాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసి ఉందని, ఈ నెల 28న రాష్ట్రం లో 29 వేల బూత్ లతో పాటు 1,144 మొబైల్ ట్రాన్సిట్ బూత్ ల ద్వారా పోలియో చుక్కలు అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు సుమారు 1.31 లక్షల మంది ఏ ఎన్ ఎం లు, అంగన్వాడీ కార్యకర్తలను వినియోగించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని 0–5 సం.ల వయసు గల పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. . జిల్లావ్యాప్తంగా 2,59,843 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయవలసి ఉందని తెలిపారు. మొదటిరోజు పోలియో చుక్కలు వేయలేని పిల్లలకు సోమ, మంగళవారాలలో ఇంటి వద్దకే వచ్చి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాధిని నిర్మూలించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు 2014 సం.లో డబ్ల్యూ హెచ్ ఓ ద్వారా భారత దేశానికి పోలియో ఫ్రీ సర్టిఫికెట్ లభించిందని తెలిపారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాలలో ఇంకా పోలియో ప్రభావం ఉన్నందున పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ వేయించడం ద్వారా వైరస్ నుండి పూర్తి రక్షణ కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా 1973 ఫిక్స్ బూత్ లు, మరిన్ని మొబైల్ బూత్ లు ఏర్పాటు చేయడమైనదన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం లో సుమారు 8 వేల మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొనడంతో పాటు రెవెన్యూ, అంగన్వాడీ, పోలీస్ సిబ్బంది కూడా పాల్గొన్నారన్నారు.

స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రులు బాధ్యత అని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ వేయడం ద్వారా శాశ్వతంగా పోలియోను నిర్మూలించగలమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టీకాలు, పల్స్ పోలియో చుక్కలను అందించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్వాడి వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027